
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 9 ఆగస్టు 2025 | 5



సరుకు దొరికింది.. సంగతి తేలాలి!
» పిఠాపురంలో చోరీ అయిన సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ల స్టాకు స్వాధీనం
» ఐదుగురి పాత్ర ఉన్నట్టు గుర్తింపు 7



అనుబంధాల ఆత్మీయ వేడుక
రక్షాబంధన్

శ్రీపాదుడే.. సోదరుడు
శ్రీపాద వల్లభుడికి రాఖీలు కట్టేందుకు తరలివచ్చిన మహారాష్ట్ర, ఉత్తరాది భక్తులు 6

అడవి ఒడి.. బతుకు బడి!
మారని ఆదివాసీల బతుకు తీరు
» దరిచేరని పథకాలు.. హక్కుల కోసం పోరాటాలు
» అభివృద్ధికి దూరంగా తండాలు
» నేడు ఆదివాసీ హక్కుల దినోత్సవం 6



ఇస్తారా.. ఎలాగని!

సీనరేజి కాంట్రాక్టుకు ముమ్మర పైరవీలు

నాడంతా ఇష్టారాజ్యంగా

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొండలు, గుట్టలు, గ్రావెల్,క్వారీలు ఉన్న ప్రతి చోటా సదరు సంస్థ సొంతంగా మనుషులను నియమించి, మైనింగ్ ఏరియాలో సీసీ కెమెరాలు బిగించి సొంత రసీదులతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఎవరు ఏ చిన్న మట్టి,గ్రావెల్ తవ్వుకున్నా ముక్కు పిండి సీనరేజి వసూలు చేసింది. ప్రత్తిపాడు,తుని నియోజకవర్గాల్లో వందలాది క్వారీల నుంచి నల్లరాయి ఇతర జిల్లాలకు ఎగుమతవగా, ఆ లారీల నుంచి ఒక్క రూపాయి వదల కుండా ముక్కు పిండి నెలనెలా కోట్లలో డబ్బులు పిండేసింది.ప్రభుత్వానికి నెలకు కట్టాల్సిన రూ.9.70 కోట్లకు బదులు రూ.15 కోట్లకు పైగా వసూలు చేసింది.ఈ కంపెనీకి గత నెల 13తో సీనరేజీ వసూలు కాంట్రాక్టు రద్దయిపోయింది.పోతూపోతూ సదరు కంపెనీ ప్రతినిధులు ఉమ్మడి జిల్లాలో బిల్లులు లేకుండా నేరుగా నగదు వసూళ్లకు దిగింది. దీంతో రౌతులపూడి, కోనసీమ జిల్లాల్లో జనం తిరగబడ్డారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో సీనరేజి వసూళ్ల కాంట్రాక్టు గడువు ముగియడంతో మళ్లీ దక్కించుకునేందుకు సుధాకర్ ఇన్‌ఫ్రా పావులు కదుపుతోంది. గత నెల 13వ తేదీతో కాంట్రాక్టు రద్దవడంతో తిరిగి వర్క్ ఆర్డరు తెచ్చుకునేందుకు పైరవీలు ముమ్మరం చేసింది. గత వైసీపీ హయాంలో అడ్డగోలుగా ఈ కంపెనీకి జగన్ సర్కారు రెండేళ్లపాటు సీనరేజీ వసూలు కాంట్రాక్టు కట్టబెట్టేసింది. దీంతో ఎక్కడికక్కడ ముక్కుపిండి సీనరేజీ వసూళ్లు చేసి కోట్లకు కోట్లు లాభాలు ఆర్జించారు. అయితే గడువు ముగియడంతో సదరు సంస్థ తిరిగి మళ్లీ దక్కించుకునేందుకు తెగ ప్రయత్నాలు చేస్తోంది. ప్రభుత్వం టెండర్లు పిలిస్తే కాంట్రాక్టు దక్కుతుందో లేదోనన్న అనుమానంతో ముందే పైరవీలకు దిగుతోంది. నెల్లూరుకు చెందిన సదరు కాంట్రాక్టరు ఇప్పటికే గనుల శాఖకు రూ.25 కోట్ల వరకు బాకీ పడ్డారు.అధికారులు ఒత్తిడి తెచ్చినా కట్టలేదు.మరో పక్క ఇటీవల కాంట్రాక్టు గడువు ముగుస్తోన్న సమయంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సదరు కంపెనీ ప్రతినిధులు బిల్లులే లేకుండా నేరుగా నగదు వసూలు చేయడం వివాదాస్పదమైంది.

అప్పట్లో అప్పనంగా కొట్టేసి...

ఉమ్మడి జిల్లాలో భారీ నల్లరాతి కొండలు, గ్రావెల్, మట్టి,లేటరైట్ తవ్వకాలకు అనుమతులివ్వడం ద్వారా ఏటా కోట్లలో ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతోంది. ప్రత్తిపాడు, తుని, పెద్దాపురం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, సీతానగరం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం తదితర నియోజకవర్గాల్లో క్వారీ, గ్రావెల్, మట్టి తవ్వకాల ద్వారా గనుల శాఖకు అధిక రాబడి వస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గనుల శాఖకు ఏటా రూ.407 కోట్ల వరకు రాబడి వచ్చేది. గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు దీనిపైనే కన్నేశారు. చిన్న తరహా ఖనిజాల సీనరేజి వసూలు బాధ్యత నుంచి గనుల శాఖను పక్కన పెట్టి మూడో కంటికి తెలియకుండా మొట్టమొదటిసారిగా సుధాకర్ ఇన్‌ఫ్రా అనే ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టేశారు. 2023 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు రెండేళ్లపాటు ఇచ్చారు. రెండేళ్లకు కలిపి కేవలం ప్రభుత్వానికి రూ.233 కోట్లు చెల్లిస్తే చాలని షరతు విధించారు. అది కూడా నెలకు రూ.9.70 కోట్ల చొప్పు న 24 వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు ఇచ్చారు. భారీగా ఆదాయం పిండాల్సిన చోట కారుచౌకగా కట్టబెట్టేసి తెరవెనుక అప్పటి ప్రభుత్వ పెద్దలు కోట్లలో నొక్కేశారు.

మళ్లీ మాకే దక్కాలి...

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో సీనరేజీ కాంట్రాక్టు రద్దయి 25 రోజులు అవుతోంది. దీంతో తిరిగి ప్రభుత్వం కొత్తగా టెండర్లు పిలిచి సీనరేజీ వసూలు అర్హత గల కంపెనీకి కట్టబెట్టాలి. అయితే ఇంకా కసరత్తు మొదలవలేదు. ఇటీవల ప్రభుత్వం కొన్ని ఉమ్మడి జిల్లాలకు కొత్తగా సీనరేజీ వసూళ్లకు ప్రైవేటు సంస్థలను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచింది. గడువు ముగిసిన జిల్లాలకు ఇంకా టెండర్లు పిలవలేదు. త్వరలో వీటిని జారీ చేసే అవకాశం ఉంది. కొత్త కంపెనీ ఖరారయ్యే వరకు ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో గనులశాఖ సీనరేజీ వసూలు చేస్తోంది. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు స్వీకరిస్తోంది. ఈ క్రమంలో అసలు ఎవరు చెల్లిస్తున్నారు? ఎవరు చెల్లించకుండా ఖనిజాలను తరలిస్తున్నారనేది గనులశాఖ అసలు పట్టించుకోవడం లేదు. మరో పక్క కొత్త టెండర్లు పిలిస్తే పోటీ పెరిగి తనకు కాంట్రాక్టు దక్కదనే ఆందోళన సుధాకర్ ఇన్‌ఫ్రాను వేధిస్తోంది.గత వైసీపీ హయాంలో ఉమ్మడి జిల్లా సీనరేజీ వసూలు కాంట్రాక్టును తెర వెనుక లాలూచీతో రెండేళ్లకు కేవలం రూ.233 కోట్లే చెల్లించేలా కారుచౌకగా కొట్టేసింది.ఇప్పుడు కొత్తగా టెండర్లు పిలిస్తే ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీనరేజీ డబ్బులను భారీగా పెంచాలి. దాదాపు రెట్టింపుస్థాయిలో అయినా బిడ్ అమౌంట్ పెంచాల్సి ఉంటుందని అధికారులే చెబుతున్నారు. తద్వారా ఖజానాకు ఆదాయం పెరుగుతుంది. సదరు కాంట్రాక్టరు మాత్రం టెండర్ల వరకు వెళ్లకుండా మళ్లీ పాత ధరకే కారుచౌకగా వసూళ్ల కాంట్రాక్టు కొట్టేయాలని ప్రయత్నం చేస్తున్నారు.

బకాయి రూ.25 కోట్లు

సదరు కాంట్రాక్టరు ప్రభుత్వానికి రూ.25 కోట్ల వరకు బాకీ పడ్డారు. గత వైసీపీ హయాంలో రౌతులపూడిలో అర బిందో సంస్థ నిర్మించే కొత్త పోర్టు కోసం భారీ నల్లరాయి కొండను కేటాయించారు.ఇందుకోసం ఆ కంపెనీ ప్రభుత్వానికి సీనరేజీ కట్టాల్సి ఉంది. కానీ అరబిందో కోసం జగన్ సర్కారు ఒక్క రూపాయి కూడా సీనరేజీ గనులశాఖకు కట్టక్కర్లేకుండా రూ.20 కోట్ల వరకు మినహాయింపు ఇచ్చేసింది. అరబిందో కోసం రద్దు చేసిన సీనరేజీ వల్ల తన రాబడి తగ్గిపోయిందని రూ.20 కోట్ల సీనరేజీ డబ్బుల్లో కొంత వాటా తన పాత బకాయిలకు సర్దుబాటు చేయాలంటూ అప్పట్లో గనులశాఖను సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా కోరింది.ఈలోపు ఎన్నికలు వచ్చేయడంతో సదరు కాంట్రాక్టర్ అనుకున్న పనికాలేదు. ఈలోపు ప్రభుత్వం మారడంతో అధికారులేమో సర్దుబాటు కుదరదని, డబ్బులు చెల్లించాలని తెగేసి చెప్పారు. అయినా ఇంకా ఈ సంస్థ బాకీలు చెల్లించ లేదు. తిరిగి నష్టపోయానంటూ ఇప్పుడు కొత్తగా కాంట్రాక్టు కొట్టేయడానికి పావులు కదుపుతోంది.

- » సీనరేజీ కాంట్రాక్టుపై అయోమయం
- » గత నెల 13న ముగిసిన గడువు
- » తప్పుకున్న సుధాకర్ ఇన్‌ఫ్రా
- » తిరిగి టెండర్ల ద్వారా కొత్త కంపెనీ
- » మళ్లీ చాన్స్‌కు పాత కంపెనీ పావులు
- » కాంట్రాక్టు పొడిగించేలా పైరవీలు
- » గత వైసీపీలో రూ.233 కోట్లు



కాజులూరు మండలం బందనపూడిలో రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

మెరుగైన పాలన కూటమితోనే సాధ్యం : మంత్రి సుభాష్

కాజులూరు(కరప), ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన పాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాజులూరు మండలం బందనపూడిలో శుక్రవారం సర్పంచ్ డేగల తిరుమల వేణిసత్యనారాయణ, డేగల నాగేంద్ర ఆధ్వర్యంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. అనంతరం రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.21.80లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని, రూ.4.5 లక్షలతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, రూ.4.28 లక్షలతో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్‌ను మంత్రి ప్రారంభించారు. కూటమి ఏడాది పాలనలోనే రూ.125 కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్టు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. తహసీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పంచాయతీరాజ్ ఏఈ భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గొల్లపాలెంలో మంత్రి సుభాష్ పర్యటించి అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న జనపల్లి భీమన్నకు రూ.10 వేల ఆర్థిక సాయమందించారు. భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలతో ఇబ్బందిపడుతున్న యనమదల సునీతకు రూ.15వేలు, డేగలపేటకు చెందిన దివ్యాంగుడు పోతురాజు గౌతమ్‌కు రూ.10వేలు చెక్కు రూపంలో అందజేసి ఆదుకున్నారు. ఇక ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి నిలువ నీడలేని ఒక కుటుంబానికి ఇల్లు కట్టిస్తానని ఇచ్చిన మాటను మంత్రి సుభాష్ నిలబెట్టుకున్నారు. గొల్లపాలెం శివారు తోటకాలనీలో ఇటీవలే సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కాలనీకి చెందిన సుందరపల్లి జ్యోతి భర్తను కోల్పోయి తన ఇద్దరు కుమార్తెలతో ఎండకు, వానకు ఆగని ఒక ప్లాస్టిక్ డేరాలో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తోంది. దీనస్థితిలో ఉన్న ఆ కుటుంబాన్ని చూసి చలించిన మంత్రి గూడు నిర్మించి ఇస్తానని, ఇద్దరి కుమార్తెలకు ఉపాధి అవకాశం కల్పిస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం శుక్రవారం ఆయన కాలనీకి వెళ్లి జ్యోతి ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేసి నూతన వస్త్రాలు అందజేశారు. నిర్మాణం పూర్తయ్యే వరకు వారి ఇంటికి అద్దె భరిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి ఔదార్యంపై నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.



వృద్ధాశ్రమం ఏర్పాటుపై వివరిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

రూ.కోటితో సామర్లకోటలో వృద్ధాశ్రమం ఏర్పాటుకు ప్రణాళిక : చినరాజప్ప

సామర్లకోట, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణంలోని రూ.కోటితో వృద్ధాశ్రమం ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ప్రతిభ విద్యా సంస్థల అవరణలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజప్ప విలేకరులతో మాట్లాడుతూ వృద్ధాశ్రమ నిర్వహణకు తన స్నేహితులు 50మంది నుంచి తలా రూ.2 లక్షల చొప్పున మూలనిధి సేకరిస్తున్నామన్నారు. అలాగే పట్టణంలో తాగునీటి సరఫరాలో తరచూ ఎదురవుతున్న సమస్యలను సీరియస్‌గా తీసుకున్నట్టు చెప్పారు. పాత పైప్‌లైన్లను పూర్తిగా తొలగించి కొత్తవి వేసేందుకు నిధులు సమకూర్చుతున్నట్టు తెలిపారు. తాను ఉపముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన అమ్మాణమ్మ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.2 కోట్లు కేటాయించాలని సీఎం చంద్రబాబును గురువారం రాత్రి అమరావతిలో జరిగిన ఒక కార్యక్రమంలో తాను కోరగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్నారు. కంచి కామకోటి మహాసంస్థానం ఏర్పాటుచేసే వేద పాఠశాలకు పెద్దాపురంలో మూడెకరాల స్థలం కేటాయిస్తామని చెప్పారు.



వంతెనపై అష్టకష్టాలు..



వంతెనపై చెరువులా..

- » శిథిలావస్థలో గుమ్మరేగుల ఏలేరు వంతెన
- » అయినా భారీ వాహనాల రాకపోకలు
- » వంతెనపై భారీ గోతులు .. వర్షం వస్తే అవస్థలే

రౌతులపూడి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మరేగుల శివారు ఏలేరు కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. పెద్దపెద్ద గోతులు పడి అధ్వానంగా మారింది. ఈ వంతెన మీదుగా తరచూ నల్లమెటల్ తరలించే భారీ వాహనాలు తిరుగుతున్నాయి. దాంతో మరింత ప్రమాదభరితంగా తయారైంది. వాస్తవానికి ఈ వంతెన సామర్థ్యం ఇరవై టన్నులు కాగా, యాభై నుంచి డెబ్బై టన్నులతో భారీ వాహనాలు తిరగడంతో వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వర్షాలు పడుతున్న సమయంలో ఈ ప్రాంతం చెరువులా మారుతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సబ్‌ప్లాన్ ఏజెన్సీ పన్నెండు గ్రామాల ప్రజలతోపాటు గుమ్మరేగుల, ఎస్.పైడిపాల, ఉప్పంపాలెం ప్రజలు కాకినాడ, తుని, అన్నవరం వెళ్లాలన్నా ఈ వంతెనపై నుంచి వెళుతుంటారు. ఒకవేళ వంతెన కూలితే చాలా గ్రామాలను రవాణా మార్గం లేనట్టే. ఇప్పటికైనా పరిమితికి మించి తిరుగుతున్న భారీ వాహనాలపై చర్యలు తీసుకుని శిథిలావస్థలో ఉన్న వంతెనకు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇష్టంగా.. సా..గు

రైతుకు సర్కారు ప్రోత్సాహం



- » 1,50,203 రైతులకు అన్నదాత సుఖీభవ
- » రైతుల ఖాతాల్లో 101.93 కోట్ల జమ
- » 80 శాతం రాయితీపై రైతులకు డ్రోన్లు
- » 688 మందికి యంత్రాలు అందజేత
- » 89,984 హెక్టార్లలో ముందస్తు సాగు
- » 45 వేల మందికి కౌలు కార్డులు అందజేత

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పథకానికి రైతన్న బ్రహ్మరథం పడుతున్నాడు. వ్యవసాయ పెట్టుబడి నిమిత్తం కీలకమైన తరుణంలో సొమ్ములు జమ చేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. కాకినాడ జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకం కింద 1,50,203 మంది రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.101.93 కోట్లు జమ చేసింది. ఒక్కొక్క రైతు బ్యాంకు ఖాతాలో రూ.7 వేలు జమ చేసింది. రాష్ట్ర పభుత్వ వాటా రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వ పీఎం-కిసాన్ వాటా రూ.2 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు ఇచ్చింది. దీంతో రైతన్న కష్టాలు తీరాయి. ఖరీఫ్ పెట్టుబడికి ఈ సొమ్ము ఎంతో ఉపయోగపడుతుంది.

ముందస్తు సాగుకు సన్నద్ధం

ప్రతి ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో సంభవించే ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతులను గట్టెక్కించే లక్ష్యంతో జిల్లాలో ముందస్తు సాగుకు అధికార యంత్రాంగం ప్రయత్నం చేస్తోంది. దానిలో భాగంగానే జిల్లాలో జూన్ నెల ఒకటో తేదీనే కాలువలు విడుదల చేశారు. దీంతో సాగు వేగవంతమైంది. జిల్లాలో సాగు విస్తీర్ణం 89,984 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 60,250 హెక్టార్లలో నాట్లు వేశారు.ఈ నెలాఖరుకు నాట్లు వేయడం పూర్తవుతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు.



యాంత్రీకరణ దిశగా..

అన్నదాత కుటుంబాల్లో ఆనందమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది.వరి సాగులో కూలీల కొరతను అధిగమించడానికి యాంత్రీకరణ దిశగా తీసుకెళుతున్నారు. పురుగు మందు పిచికారీ చేయడానికి డ్రోన్లు 80 శాతం రాయితీపై రైతులకు ఇస్తున్నారు.జిల్లాలో బ్యాటరీ పవర్ స్ప్రేయర్లు, ట్రాక్టర్లతో పాటు రోటోవేటర్,బ్రాస్ కట్టర్ వంటి పరికరాలను ఎస్ఎంఏఎం పథకం కింద 688 మంది రైతులకు రూ.3.82 కోట్ల రాయితీతో మంజూరు చేశారు. జిల్లాలో 42 డ్రోన్లు లక్ష్యం కాగా 42 మంది రైతుల ఖాతాలలో సొమ్ములు జమ చేశాం. ఇప్పటివరకు 25 మందికి కిసాన్ డ్రోన్లు అందజేయగా, ఈ నెలాఖరుకు మిగిలిన వారికి డ్రోన్లు ఇస్తారు. సాగులో డ్రోన్ల టెక్నాలజీ వినియోగించడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ ఖరీఫ్ లో అధిక దిగుబడే లక్ష్యంగా సాగు పనులు జరుగుతున్నాయి.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ

సొంత భూమి ఉన్న రైతులకే కాకుండా కౌలు రైతుకు కూడా అన్నదాత సుఖీభవ పథకం వర్తించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో ఈ-క్రాప్‌లో నమోదైన రైతులను గుర్తించి అర్హులైన కౌలు రైతులకు కౌలు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తాం.జిల్లాలో 69 వేల సీసీఆర్సీ కార్డులు లక్ష్యం కాగా ఇప్పటివరకు 45 వేల వరకు కార్డులు పంపిణీ చేశాం. అన్నదాత సుఖీభవ పథకంలో నగదు జమకాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తమ బ్యాంకు ఖాతాలకు ఈకేవైసీ, ఎన్పీసీఎల్ లింకు చేయించుకోవాలి.

- విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ సంచాలకులు



పెనుగుదురులోని చొల్లంగి వెంకటేశ్వరస్వామి భూమిలో గ్రావెల్‌తో ఫిల్లింగ్ చేసి నాటిన కొబ్బరి మొక్కలు.. ఫిర్యాదు అందడంతో పరిశీలిస్తున్న అధికారులు

దేవుడి భూమి ఆక్రమణ

చొల్లంగి వెంకటేశ్వరస్వామి భూమి అన్యాక్రాంతం..!

కరప, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): చొల్లంగి వెంకటేశ్వరస్వామి ఆలయ భూమి అన్యాక్రాంతమయ్యే పరిస్థితి దాపురించింది. కరప మండలం పెనుగుదురులోని సర్వేనెంబరు 176లో 3.29 ఎకరాల భూమి ఒక ప్రైవేట్ లేఅవుట్‌కు చేర్చి ఉండడంతో దాన్ని హస్తగతం చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చొల్లంగి వెంకటేశ్వరస్వామి గుడి నిర్వహణ బాధ్యతలు చేపట్టే అర్చకులు అర్చకమాన్యం కింద వంశపారంపర్యగా ఈ భూమిని అనుభవిస్తున్నారు. ప్రస్తుతం అర్చకత్వం వహిస్తున్న శేషాచార్యులు, అతని సోదరుల నుంచి ఒక వ్యక్తి ఈ భూమిని సాగుచేసుకుంటాననే నెపంతో లీజుకు తీసుకుని దాన్ని మట్టి, గ్రావెల్‌తో పూర్తిగా ఫిల్లింగ్ చేశాడు. తన లేఅవుట్‌కు అనుగుణంగా ఇందులో కూడా కొబ్బరిమొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దారు. కోట్లు విలువ చేసే దేవదాయశాఖ భూమి అన్యాక్రాంతమవుతుందనే వార్త చుట్టుపక్కల దావానలంలా వ్యాపించింది. కాకినాడ ప్రధానరహదారిని చేర్చి జరుగుతున్న ఈ భూకబ్జాపై దేవదాయశాఖాధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు, భక్తుల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా గురువారం రాత్రి నుంచి ఎండోమెంట్ ల్యాండ్‌లో లారీలతో గ్రావెల్‌ను భారీగా డంప్‌చేయించి మిషన్‌తో సర్దుబాటు చేయించారు.ఈ మేరకు స్థానికులు దేవదాయశాఖాధికారులకు ఫిర్యాదుచేశారు. లీజుదారుడి అక్రమాలపై పలు ఫిర్యాదులందడంతో శుక్రవారం సాయంత్రం జిల్లా దేవాదాయశాఖాధికారి కె.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఫణీంద్రకుమార్, ఈవోలు మురళీవీరభద్రరావు, రాజేశ్వరరావులు అర్చకుడిని వెంటబెట్టుకుని అక్రమంగా ఫిల్లింగ్ చేసిన ఎండోమెంట్ ల్యాండ్‌ను పరిశీలించారు. దేవదాయశాఖ అనుమతి తీసుకోకుండా బయట వ్యక్తికి లీజుకు ఎలా ఇచ్చారని, భూమి స్వరూపాన్ని మార్చే అధికారం మీకెవరిచ్చారంటూ అర్చకుడిపై అధికారులు మండిపడ్డారు. దీనిపై ఇన్‌స్పెక్టర్ ఫణీంద్రకుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమన్నారు. అర్చకుల నుంచి ఈ భూమిని స్వాధీనం చేసుకుని సింగిల్ ట్రస్ట్ ఏర్పాటు చేస్తామని, దేవదాయశాఖ కమిషనర్‌కు లేఖ రాసి ఈ భూమి లీజుకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తామని వివరించారు.అప్పటివరకు ఈ భూమిలో ఎటు వంటి కార్యకలాపాలు చేపట్టవద్దని లీజుదారుడికి స్పష్టంచేశామన్నారు. భారీగా ఫిల్లింగ్ చేసిన మట్టి,గ్రావెల్ ఏంచేస్తారనే విషయమై అధికారుల నుంచి స్పష్టత కరువైంది.

అర్చక మాన్యాన్ని ప్రైవేట్ లేఅవుట్‌లో కలిపే ప్రయత్నం

ప్రకృతి..ఆకృతి!









ఎన్నెన్నో అందాలు.. అన్నింటా వర్ణాలు.. అని ఒక కవి అన్నారు.. అది నిజమే.. ఈ చిత్రాలే చూడండి.. ప్రకృతి మనకు ఎంతో ఇవ్వడమే కాదు.. ఎంతో నేర్పింది కూడా.. ఇవి ప్రకృతి గీసిన రక్షాబంధన్ ఆకృతి.. రాఖీ పండుగ రోజున సోదర ప్రేమను తెలుపుతూ రాఖీలు కడుతుంటారు. విలువైన కానుకలు ఇచ్చి సోదరులు వారి సోదరీమణుల పట్ల ఆత్మీయత చూపుతారు. ప్రస్తుతం ట్రెండ్ మారింది. తమ సోదరులు పదికాలాలు పచ్చగా ఉండాలని.. మొక్క వలే రోజురోజుకీ అభివృద్ధి చెందాలని ఇటీవల కాలంలో మొక్కలు ఇచ్చిపుచ్చుకునే సాంప్రదాయం వచ్చింది. ప్రస్తుతం కడియం నర్సరీలో లభించే ఈ రాఖీ పుష్పాలు అనేక రంగుల్లో లభ్యమవుతున్నాయి. మంచి పరిమాణంలో పువ్వు, దాని చుట్టూ రేఖలు ఉండి అందంగా ఉండే ఈ రాఖీ పుష్పం పేరు ప్యాసీ ఫ్లోరా అంటారు. దీనిని కౌరవులు-పాండవులు మొక్క అని కూడా పిలుస్తారు.

- కడియం

శ్రీపాదుడే.. సోదరుడు



శ్రీపాద శ్రీవల్లభుడికి రాఖీలు కట్టేందుకు తరలివచ్చిన మహారాష్ట్ర, ఉత్తరాది భక్తులు



పిఠాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదుడిని సోదరుడిగా భావించే మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాల భక్తులు శ్రావణ (రాఖీ) పౌర్ణమికి ముందుగానే ఆయన జన్మ స్థలమైన కాకినాడ జిల్లా పిఠాపురం తరలివచ్చారు. దీంతో హోటళ్లు, లాడ్జీలు, ప్రైవేటు అతిథిగృహాలు కిటకిటలాడుతున్నాయి. శ్రీపాద శ్రీవల్లభులకు వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రావణి పౌర్ణమి రోజున రాఖీ కట్టడంతో ఈ రోజుకు విశేష ప్రాధాన్యం ఉంది. అదే సమయంలో మహారాష్ట్ర, ఉత్తరాది భక్తులు తమ ఇంట ఇలవేల్పుగా కొలిచే శ్రీపాద శ్రీవల్లభుడిని సోదరుడిగా భావిస్తారు. దీంతో రాఖీ (శ్రావణ లేదా జంధ్యాల) పౌర్ణమికి మహారాష్ట్ర, గోవా, ఉత్తరాది, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గుజరాత్, బెంగాల్, ఒడిసా, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానానికి భారీగా తరలివచ్చారు. వారంతా నాలుగైదు రోజులు ఇక్కడే ఉండి పూజల్లో పాలుపంచుకుంటారు. రాఖీ రోజున సాధారణంగా మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి వారి ఆశీస్సులు పొందుతారు. అందుకు భిన్నంగా మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాల భక్తులు మాత్రం శ్రీపాద శ్రీవల్లభులు, ఈ క్షేత్రంలో ఉన్న ఔదుంబర వృక్షానికి రాఖీలు కడతారు. శ్రావణి పౌర్ణమి రోజున రాఖీలు కట్టడం ద్వారా శ్రీపాదుని ఆశీస్సులు లభిస్తాయని భక్తుల నమ్మకం. రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు పలు ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ, అభిషేకాలు జరుగుతాయి. మహా సంస్థానానికి తరలివచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు. పాదగయ క్షేత్రంలో స్వయంభూగా వెలసిన దత్తాత్రేయ స్వామికి, ఆవరణలో ఉన్న అలక్‌నిరంజన్ దత్త బృందావనంలో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగనున్నాయి. సాయంత్రం పల్లకీ సేవ, పుష్పార్చన జరుగుతాయి. స్వయంభూ దత్తాత్రేయ స్వామికి లక్ష మల్లెల అర్చన జరుపుతామని ఈవో ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ చెప్పారు.



అడవి ఒడి.. బతుకు బడి..



ఈ ఒక్క చిత్రంచాలు.. ఆదివాసీల జీవన చిత్రం వివరించడానికి.. ఇది వారి నివాసం.. ఇదే వారి ఆవాసం.. పైన తాటాకులతో చిన్న కప్పు తప్ప.. గోడల్లేవ్.. మేడల్లేవ్.. చివరికి గచ్చుల్లేవ్.. నాటికి.. నేటికీ ఇదే వారి జీవనవిధానం.. ఏళ్లు గడచిపోతున్నాయి.. అయినా నేటికీ అలాగే ఉన్నారు.. ప్రభుత్వాలు మార్చలేకపోతున్నాయి..

ఎంతో అభివృద్ధి చెందాం.. ఎన్నో సాధించాం.. అని జబ్బలు చరుచుకుంటాం.. ఒకసారి అడవి లోకి వెళ్లి ఆదివాసీలను చూస్తే.. మన సాధిం చింది ఏమిటో అర్థమైపోతోంది..ఎందుకంటే పూర్వం ఎలా ఉన్నారో నేటికీ అలాగే ఉన్నారు.. ఎక్కడా మార్పులేదు.. ప్రభుత్వాలు చట్టాలు చేస్తున్నా.. పథకాలు ప్రకటిస్తున్నా అవేం వారి చెంతకు చేరడంలేదు.. నేడు ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

మారని ఆదివాసీల బతుకు తీరు

- దరిచేరని పథకాలు..అందని ఫలాలు
- అభివృద్ధికి దూరంగా తండాలు
- హక్కుల కోసం పోరాటాలు
- నేడు ఆదివాసీ హక్కుల దినోత్సవం

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

ఓ ప్రత్యేక సంప్రదాయం.. సంస్కృతి.. ఆచారం వారిది..వారి జీవనమంతా జల్ జంగిల్ జమీన్‌పైనే. ఆ మేరకే వారి ఆవాసాలు ఉంటాయి.వారే మూలవాసులుగా పిలవబడే ఆదివాసీలు. కాల క్రమంలో ఆదివాసీలు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అడుగు మోపుతున్నప్పటికి ఆ సంఖ్య పరిమితమే. అందుకే రాజ్యాంగంలోని ఐదు,ఆరవ షెడ్యూల్‌లో వారి కంటూ ఓ ప్రత్యేక చట్టా లు, హక్కులు కల్పించబడ్డాయి.అయితే ఆ ఫలాలు తమకు సంపూర్ణంగా అందడం లేదన్నది వారి వాదనగా ఉంది. అభివృద్ధి పేరిట తమ మనుగడకే ముప్పు వాటిల్లుతోందన్న ఆవేదన వినిపిస్తోంది. 1994లో ఐక్యరాజ్య సమితి ఆదివాసీల జీవన స్థితిగతులపై ఓ అధ్యయనం చేసింది. ఇందులో భాగంగా ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకై ప్రతి ఏడాది ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరుపుకోవాలని తీర్మానించింది. అప్పటి నుంచి ఆగస్టు 9న ఆదివాసీ ప్రాంతాల్లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఒక వేడుకలా జరుపుకుంటున్నారు. అయితే హక్కుల సాధన, మనుగడ కోసం ఆదివాసీ సంఘాలు అలుపెరగని పోరాటం చేస్తూనే ఉన్నాయి. ఖనిజ సంపద వెలికి తీసినా, నీటి ప్రాజెక్టులు నిర్మించతలపెట్టినా చివరకు అక్కడ ఆదివాసీలే నిర్వాసితులుగా మారాల్సిన పరిస్థితి ఉంది. మన రాష్ట్రంలో పోలవరం, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాలలో ఖనిజ వెలికితీత ప్రదేశాలే ఇందుకు ఉదాహరణ. దీంతో తమ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందని ఆదివాసీ నాయకులు మొర పెట్టుకుంటున్నారు. హక్కుల సాధనకు పోరాటాలు చేయడంతోనే తమ జీవి తాలు తెల్లారిపోతు న్నాయంటున్నారు.దేశం మొత్తం మీద తొమ్మిది కోట్ల మంది జనాభా కలిగి ఉన్న ఆదివాసీల పండుగలను సైతం ప్రభుత్వాలు గుర్తించక పోవడం విడ్డూరం. చివరకు ఆదివాసీ సంతతి తమ మాతృభాషను సైతం మర్చిపోయే ప్రమాదం పొంచి ఉందంటున్నారు. తమ భాష పరిరక్షణలో భాగంగా మన్యంలో ప్రాథమిక విద్య ఆదివాసీ మాతృ భాషలో బోధించాలని పట్టుపడుతున్నారు. ఇది కొంతమేర ఆచరణలోకి వచ్చి ఆ తర్వాత ఆ తరహా బోధన పరిమితమైంది.

వలస ఆదివాసీలది మరో వేదన


మన రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రాలకు ఛత్తీస్‌గఢ్ నుంచి పలు ఆదివాసీ కుటుంబాలు వలస వచ్చాయి. వారిలో అధికులు రిజర్వు ఫారెస్టునే తమ ఆవాసాలుగా ఎంచుకున్నారు. ఆ క్రమంలో ఎన్నో కష్టాలు పడ్డారు. జైళ్ల పాలయ్యారు. కాల క్రమంలో తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఆధార్, రేషన్, ఓటు హక్కులను కల్పించాయి. తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసి పాఠశాలలు ఏర్పాటు చేశాయి. చట్టంలోని నిబంధనల మేరకు వారికి కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే అవకాశం లేకుండాపోయింది. దీంతో వలస ఆదివాసీ సంతతి చదువులు అర్ధంతరంగా నిలిచిపోతున్నాయి. పౌష్టికాహారం అందక ఆ చిన్నారులు వ్యాధుల బారిన పడుతున్న సంఘటనలు చాలానే ఉన్నా యి. ఛత్తీస్‌గఢ్‌లో వీరంతా మురియా తెగకు చెం దిన వారుగా ఉన్నారు. తెలంగాణలోని ఖమ్మం, వరంగల్,మన రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలో దాదాపు ఈ తరహా కుటుంబా లు 20 వేల పైచిలుకే ఉన్నాయన్నది ఓ అంచనా.



మనకు కుళాయిలు వచ్చాయి.. మరి ఆదివాసీలకో నేటికీ.. నీటికి వారి శ్రమే ఆధారం..



యానాంలో వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారిని రూ.23 లక్షల కరెన్సీతో ధాన్యలక్ష్మిగా అలంకరించిన దృశ్యం



కాకినాడ జిల్లా అన్నవరంలో వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారిని రూ.3 లక్షల కరెన్సీతో ధాన్యలక్ష్మిగా అలంకరించిన దృశ్యం

వరలక్ష్మీ వైభవం



రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో బాలాత్రిపురసుందరి అమ్మవారు

శ్రావణ మాసం మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పలు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపి అర్చకులు విశేష అలంకరణ చేశారు. వివిధ రూపాల్లో అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పునీతులయ్యారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవికి నెమలి పింఛాలతో అలంకరణ



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఏవీ అప్పారావు రోడ్డులో పుష్పాలంకరణలో సంతోషిమాత అమ్మవారు

అనుబంధాల ఆత్మీయ వేడుక రక్షాబంధన్



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రాఖీ పండగంటే.. రాఖీ కట్టడం, రాఖీ కట్టించుకోవడం కాదు.. గిఫ్టులు ఇవ్వడం ఏ మాత్రం కాదు.. అక్క-తమ్ముడు, అన్న-చెల్లెలు మధ్య అనుబంధం చాటుకోవాలి. ఆ బంధం జీవితాంతం కొనసాగేలా భరోసానివ్వాలి. ముఖ్యంగా అన్నతమ్ముళ్లు తమ అక్కచెల్లెమ్మల కోసం వినూ త్న ఆలోచనలతో ముందుకు సాగాలి. అప్పుడే ఆ బంధానికి విలువ.. ఆ ఆత్మీయ వేడుక జీవితంలో మధురానుభూతి నింపాలి.

మారుతున్న కాలానికి అనుగుణంగా రక్షణగా నిలవడం అనే పదానికి విస్తృతి పెరిగిందనే చెప్పాలి. రోజురోజుకీ పెరుగుతున్న ధరలు, ఉద్యోగ భద్రతపై అనుమానాలు నెలకొన్న తరుణంలో కేవలం భౌతిక రక్షణే కాకుండా ఆర్థికంగానూ వారికి భరోసా ఇవ్వాలి. అదే అక్కాచెల్లెళ్లకిచ్చే నిజమైన బహుమతి.



రాజమహేంద్రవరంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

కేవలం అక్కాచెల్లెళ్ల ఆరోగ్యానికే కాదు.. వారి భవిష్యత్తుకూ భరోసా కల్పించేలా బీమా పాలసీ కొనిపెట్టడం మంచి మార్గం. వారి కోసం టర్మ్ ఇన్సూరెన్స్‌తో పాటు ఆరోగ్య బీమా పాలసీ కూడా తీసుకోవాలి. ఎంత తక్కువ వయసులో తీసుకుంటే వారికి అంత ప్రయోజనం. దీనివల్ల భవిష్యత్తులో ఏమైనా అనారోగ్య సమస్యలు తలెత్తినా ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకాకుండా ఉంటుంది. మరోవైపు పెరుగుతున్న వైద్య ఖర్చుల నేపథ్యంలో వారికి మంచి బహుమతి ఇచ్చిన వారమవుతాం.

ఓ మంచి ప్రణాళికను సిద్ధం చేయండి..

అక్కాచెల్లెళ్లకు ఆర్థిక వ్యవహారాలపై పెద్దగా అవగాహన లేకపోతే వారికి ఓ నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందించి ఇవ్వండి. ఆమె భవిష్యత్తు అవసరాలు, లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేయాలి. చదువు, ఉద్యోగం, మదుపు, పొదుపు, వివాహానంతర జీవితం... వీటన్నిటినీ పరిగణలోకి తీసుకుని వారికి ఆర్థిక భరోసానిచ్చే చక్కటి ప్రణాళికను వారి చేతిలో పెట్టాలి.



డిజిటల్ బంగారం బెటర్...

రాఖీ పండగ సందర్భంగా కొంతమంది తమ సోదరీమణులకు బంగారాన్ని బహుమతిగా ఇస్తుంటారు. అయితే భౌతిక బంగారం కంటే పసిడి బాండ్లను కొనివ్వడం మేలు. ఇప్పుడు అవి అందుబాటులో లేకపోయినా.. ఆ సొమ్మును పక్కకు తీసి ప్రభుత్వం వాటిని విక్రయించినప్పుడు కొని గిఫ్ట్‌గా ఇవ్వండి. దీనివల్ల బంగారంతో పాటు ఏటా కొంత రాబడి కూడా అందించినవారవుతారు. భద్రత కరువైన ఈ తరుణంలో డిజిటల్ రూపంలో గోల్డ్ ఇవ్వడం మంచి ఆలోచన.

రక్షాబంధన్ వేడుకలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ముస్తాబైంది. తమ ప్రియమైన సోదరులకు రాఖీలు కట్టేందుకు ఇంటి ఆడపడుచులు సిద్ధమవుతున్నారు. అన్నా చెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగకు ప్రతి ఇల్లు ముస్తాబైంది. తమ సోదరులు జీవితాంతం తమకు రక్షగా ఉండాలని ఇవాళ వారి చేతికి అక్కాచెల్లెళ్లు రాఖీ కడతారు. మార్కెట్లో రకరకాల రాఖీల కొనుగోళ్లల్లో అక్కలు, చెల్లెళ్లు బిజీబిజీగా ఉన్నారు.





పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, యోగా ఈవెంట్ నిర్వహిస్తున్న చాగల్లు హైస్కూలు విద్యార్థినులు

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

- కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- చాగల్లు హైస్కూల్లో రాష్ట్ర స్థాయి టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ ప్రారంభం

చాగల్లు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా చాగల్లు హైస్కూల్లో రాష్ట్రస్థాయి జూనియర్ బాల, బాలికల మిక్స్‌డ్ టార్గెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కొవ్వూరులో నిర్మాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యమివ్వాలన్నారు. శాప్ డైరెక్టర్ పి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు క్రీడా సామగ్రి కిట్లు అందజేయడానికి రూ.30వేలు చొప్పున కేటాయించామన్నారు. త్వరలోనే సామగ్రి కొనుగోలు చేసి పాఠశాలలకు ఇస్తామన్నారు. క్రీడల్లో రాణించే వారికి ప్రభుత్వం ఇచ్చే నగదు పారితోషికాన్ని పెంచినట్టు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో క్రీడల అభివృద్ధికి విప్లవాత్మకమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కడపలో స్పోర్ట్స్ స్కూలు అభివృద్ధికి రూ.40లక్షలు కేటాయించినట్టు చెప్పారు. రాష్ట్రంలో 110 క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తి, టీమ్ స్పిరిట్ కలిగి ఉండాలన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి పదికి పైగా జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కరుటూరి సతీష్, ఎస్ఎంసీ చైర్మన్ కొఠారు గోపాలకృష్ణ, కూటమి నాయకులు తాళ్లూరి హరిశ్చంద్ర ప్రసాద్, ఈడుపుగంటి సుబ్బారావు, తాళ్లూరి వరప్రసాద్, మిరియాల సతీష్, వివిధ పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు, సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

వారాహిదేవిగా వనదుర్గమ్మ

అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం తరపున సారె సమర్పణ



వారాహిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న వనదుర్గ

అన్నవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గమ్మ అమ్మవారి శ్రావణ మా సోత్సవాల్లో భాగంగా నాల్గోరోజైన శుక్రవారం వారాహిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేషపూజలు, కుంకుమార్చనలు, అర్చకస్వాములు నిర్వహించారు. దేవస్థానం ఉద్యోగుల సంఘం తరపున అమ్మవారికి సారెను సమర్పించారు. ఈవో వీర్ల సుబ్బారావు, ఉద్యోగుల సంఘం నాయకులు గంటా విష్ణు, అనకాపల్లి ప్రసాద్, బాస్కర్, పోల్నాటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్ర వ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



వనదుర్గకు దేవస్థానం ఉద్యోగుల సంఘం తరపున సారె తీసుకెళ్తున్న ఉద్యోగులు

ఆదివాసీల ఊపిరి ఆపేస్తారా?

- రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఆగని మరణాలు
- ప్రశ్నార్థకంగా గర్భిణుల ఆరోగ్యం
- అందుబాటులో ఉండని వైద్యులు
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు
- ఆదివాసీ మహిళ మరణం
- కేసు స్వీకరించిన జాతీయ కమిషన్లు

(రంపచోడవరం/ఆంధ్రజ్యోతి)

ఆదివాసీల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం పడుతున్న తపనకు భిన్నంగా నడుస్తున్న రంపచోడవరం మన్యంలోని ప్రభుత్వ రంగ ఆసుపత్రులు ఆదివాసీల ఊపిరి తీస్తున్నాయి. రంపచోడవరంలోని ఏరియా ఆసుపత్రి అయితే మృత్యు కుహరంగా మారి ఇక్కడకు చేరడానికే ఆదివాసీ గర్భిణులు ఆందోళన చెందే దుస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో అందిన సేవలకు భిన్నంగా అన్ని ఆసుపత్రుల్లోనూ మెరుగైన వైద్య సేవలను అందించాలని ప్రభుత్వం భావించి అనేక వసతులను కల్పించినా ఆదివాసీల ప్రాణాలకు ఆసుపత్రుల్లో రక్షణ లేకుండా పోతోంది. కేవలం 8 నెలల్లో ఒక్క రంపచోడవరం ఏజెన్సీ డివిజన్ పరిధిలోని 7 మండలాల్లోని ఆదివాసీలు చవిచూసిన ఆసుపత్రి మరణాలు వెలుగులోకి వచ్చినవి కొన్నే అయితే వెలుగు చూడనివి ఎన్నో ఉన్నాయి. మన్యంలో ఉన్న ఆదివాసీల స్థితి గతులను దృష్టిలో ఉంచుకుని కార్పొరేట్ స్థాయిలో అన్నిరకాల వైద్య సేవలకు అనుగుణంగా ఆసుపత్రులను తీర్చిదిద్దితే వైద్యులు విధులను విస్మరించి అవసరానికి అందుబాటులో లేకుండా పోవడంతో ప్రాణా పాయస్థితుల్లో మరణాలను నివారించగలిగే అవకాశాలను, మెరుగైన వైద్యం పొందే హక్కులను ఆదివాసీలు కోల్పోతున్నారు. ఒక్క రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొంది మరణించిన వారే ఈ సంవత్సరంలో పదివరకూ ఉంటాయని అనధికార అంచనా!



రంపచోడవరం ఏరియా ఆసుపత్రి

చేతులు దులిపేసుకుని...

పండా సింధూరం అనే ఆదివాసీ మహిళ తన నాల్గో కాన్పు కోసం రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో 20 రోజుల పాటు చికిత్స తీసుకున్న అనంతరం బుధవారం ప్రసవానికి తీసుకువెళ్లిన సందర్భంలో బిడ్డ చేతులు బయటకు వచ్చాక ప్రాణాపాయ స్థితి కి చేరు కోవడంతో అప్పటికప్పుడు రాజమండ్రికి తరలించి ఇక్కడి ఆసుపత్రి వైద్యులు చేతులు దులిపేసుకున్నారు. అయితే రాజమండ్రిలో ఆమె ప్రాణాలు కోల్పోగా, ఆమె కడుపులో ఉన్న బిడ్డను సిజేరియన్ చేసి తీసేందుకు ప్రయత్నించినా బిడ్డ ప్రాణాలు కూడా దక్కలేదు. వాస్తవానికి రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో సిజేరియన్ చేసేందుకు అవసరమైన అన్ని వసతులూ, సౌకర్యాలూ ఉన్నా సమయానికి సిజేరియన్ చేయకపోవడమే ఆదివాసీ మహిళ మరణానికి కారణమైంది. అంతకు కొద్దిరోజుల ముందు మరో మహిళను కూడా ఇదే పరిస్థితుల్లో రాజమండ్రికి తరలిస్తుంటే మార్గంమధ్యలో అంబులెన్సులోనే ప్రసవించింది. అంతకు ముందు వై.రామవరం మండలానికి చెందిన కాకూరి పార్వతి అనే మహిళ కూడా సహజ ప్రసవం సమయంలోనే మరణించింది. ఆమెకు కూడా సిజేరియన్ చేసే అవకాశం ఉన్నా కాపాడలేదు.

వైద్యుల్లో నిర్లక్ష్యం...

ప్రతి ఘటనపైనా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకే కాకుండా మన్యానికి పెద్ద దిక్కుగా ఉన్న రంపచోడవరం ఐటీడీఏ ఉన్నతాధికారికి తెలిసినా ఇటువంటి ఘటనలను పునరావృతం కాకుండా చూడలేకపోతున్నారు. ఇక్కడి పరిస్థితిని లోతుగా చూస్తే అన్ని హంగులతో ప్రభుత్వం చర్యలు చేపట్టినా ఆసుపత్రిలో వైద్యులకు చిత్తశుద్ధి కొరవడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎందరో ఆదివాసీలు ఆర్థిక పరిస్థితులు బాగోలేక ప్రభుత్వం ఆదుకుంటుందని రంపచోడవరం ఏరియా ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. కానీ ఇక్కడ వైద్యం సులభంగా అందించడం లేదు.

బాధితుల ఫిర్యాదులు

ప్రసవం కల్పించి, తల్లీబిడ్డలను సురక్షితంగా పంపించే సౌకర్యాలు ఉన్నా ఆ దిశగా పని చేయడంలో రంపచోడవరం ఆసుపత్రి విఫలమైంది. ఆదివాసీల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో సీరియస్‌గా వ్యవహరిస్తున్నప్పటికీ ఇద్దరు ఐఏఎస్ అధికారులు, కీలక ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో రంపచోడవరం కేంద్రంలో నడుస్తున్న నిర్లక్ష్య మరణాలు ఆగడం లేదు. ఆయా ఘటనలు జరిగినపుడు మొక్కుబడిగా వ్యవహరిస్తూ ఆయా వైద్యులను కాపాడే దిశగానే ఉన్నతాధికారుల చర్యలు ఉండటంతో బాధితులు నేరుగా జాతీయ హక్కుల, జాతీయ గిరిజన కమిషన్లను ఆశ్రయించి ఫిర్యాదులు చేస్తున్నారు. వై.రామవరం ఆదివాసీ మహిళ మరణంపై ఇప్పటికే జాతీయ హక్కుల కమిషన్, గిరిజన కమిషన్లు కేసు నమోదు చేసుకున్నాయి. ఆదివాసీ దినోత్సవ నేపథ్యంలోనైనా ముఖ్యమంత్రి మన్యం పర్యటనలో ఆదివాసీల ఆరోగ్యంపై సీరియస్‌గా స్పందించి ఆరోగ్య సేవలు అందేలా కృషి చేస్తారని ఆదివాసీ సమాజం ఎదురుచూస్తోంది.

గర్భిణి మృతిపై విచారణ



సింధూరం (ఫైల్)

రంపచోడవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిండు గర్భిణి పండా సింధూరం, గర్భంలో ఉన్న బిడ్డ మృతిపై రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో పాడేరు డీసీహెచ్ వీరవేణి శుక్రవారం విచారణ ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శేషారెడ్డి, డాక్టర్లు, సిబ్బందిని విచారించారు. ఈ విచారణ నివేదికను సెకండరీ హెల్త్ డైరక్టర్‌కు అందించనున్నట్టు ఆమె తెలిపారు.

సరుకు దొరికింది... సంగతి తేలాలి!

- పిఠాపురంలో చోరీ అయిన సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ల స్టాకు స్వాధీనం
- సరుకు తరలించిన వాహనాల సీజ్
- ఐదుగురి పాత్ర ఉన్నట్టు గుర్తింపు
- వారి గత చరిత్రపై విచారణ



స్వాధీనం చేసుకున్న ప్యాకెట్లను వాహనాల్లోకి ఎక్కిస్తున్న దృశ్యం

పిఠాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ ప్యాకెట్ల లోడు లారీ చోరీ కేసులో ఐదుగురు వ్యక్తుల పాత్ర ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే లారీ దొరకగా, వివిధ ప్రాంతాలకు తరలించిన సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ల స్టాకుతో పాటు, అందుకు వినియోగించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్న పోలీసులు వారి గత చరిత్రపై దృష్టి పెట్టారు. వారికి గల రాజకీయ సంబంధాలపై ఆరా తీస్తున్నారు.

అసలేం జరిగిందంటే...

కాకినాడ జిల్లా పిఠాపురంలో ఆయిల్‌ప్యాకెట్లు లోడుతో ఉన్న లారీ 2 రోజుల క్రితం చోరీ కావడం సంచలనం కలిగించింది. కాకినాడలోని జెమిని ఆయిల్ ఫ్యాక్టరీ నుంచి రూ.28లక్షలు విలువైన సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు లోడుతో ఉన్న లారీని పిఠాపురం తీసుకువచ్చి ఈనెల 5న రాత్రి పార్కు చేయగా దానిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. సరుకుతో సహ లారీ మాయమైన విషయాన్ని బుధవారం ఉదయం గుర్తించిన లారీ ఓనర్ కమ్ డ్రైవర్ దగ్గు అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. 6న ఉదయం 11గంటల సమయంలో ఖాళీ లారీని తుని సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద గుర్తించారు. అందులో సరుకు లేకపోవడంతో సరుకు ఎక్కడ డంప్ చేశారనే విషయంలో పోలీసులు విచారణ చేపట్టారు. గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు, అక్కడ ఒక వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వచ్చి టోల్‌ఫీ చెల్లించడం తదితర విషయాలను గుర్తించి విచారణ సాగించగా సరుకు ఎక్కడెక్కడ దింపారో వెల్లడైంది. కత్తిపూడి శివారు, మండపం సమీపంలో మామిడితోటల్లో బొలెరో, టాటా మేజిక్ వాహనాలు, ట్రాక్టర్ల ద్వారా సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లను తరలించి నిల్వ చేసినట్టు గుర్తించారు. వీటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా మరికొంత సరుకు దొరకాల్సి ఉంది. ఈ సంఘటనలో పిఠాపురం పట్టణానికి చెందిన ఇద్దరు, పండూరుకు చెందిన ఒకరు, మండపం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల పాత్ర ఉన్నట్టు ఇప్పటి వరకూ గుర్తించారు. వారిలో కొందరు ఒక రాజకీయ పార్టీ కోసం పనిచేయడమే లారీ యూనియన్ పదవుల కోసం ప్రయత్నించినట్టు చెబుతున్నారు. వీరు ఈ ఒక్క లారీ చోరీకే పాల్పడ్డారా, 3 రోజుల క్రితం జరిగిన నూకల లోడు లారీ చోరీ సంఘటన, అంతకు ముందు జరిగిన గుట్కా ప్యాకెట్లు వాహనం చోరీ తదితర సంఘటనలతో సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. వారి గత చరిత్రపై ఆరా తీస్తున్నారు. లారీని చోరీ చేసిన తర్వాత కొందరు వ్యక్తులు కారులో అనుసరించినట్టు సమాచారం. ఈ వాహనం ఎవరిది, కారులో ఎవరెవరు ఉన్నారు తదితర అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి కథనంతో...

సన్‌ఫ్లవర్ ఆయిల్ లోడు లారీయే గాక గత ఆదివారం రాత్రి నూకలలోడు లారీ చోరీకి గురైందని, జీపీఎస్ ఉండడంతో రౌతులపూడి మండలం గిడజాం వద్ద దానిని గుర్తించారని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై పోలీసులు ఇప్పుడు దృష్టిసారించారు. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకోవడంతో సదరు లారీ యజమాని వద్ద ఫిర్యాదు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. లారీ ఎలా చోరీకి గురైందో ఆరా తీస్తున్నారు.

నాలుగు దర్యాప్తు బృందాల ఏర్పాటు

లారీ చోరీ సంఘటనపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు 4 దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేసినట్టు పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దర్యాప్తు చేస్తున్నామన్నారు. లారీతో పాటు మాయమైన సరుకును గుర్తించామని తెలిపారు. కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్టు ఆయన చెప్పారు.

యానాంలో యువకుడి అనుమానాస్పద మృతి



మరణించిన గురుమూర్తి

యానాం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): యానాంలోని ఓ లాడ్జిలో గురువారం అర్ధరాత్రి యువకుడు అనుమనాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం కేశనకుర్రుకు చెందిన చింతా గురుమూర్తి(21) ముగ్గురు స్నేహితులతో యానాం రాజీవ్‌బీచ్‌లోని సూర్యలాడ్జిలో దిగారు. వారు సాయంత్రం నుంచి మద్యం తాగుతున్నారు. మొదటి అంతస్తులోని గదిలో సహచార మిత్రులు పడుకోగా ఫోన్ మాట్లాడడానికి వచ్చిన గురుమూర్తి అనుమనాస్పదస్థితిలో కిటికీ పక్కనే ఉన్న కరెంటు తీగలపై పడిపోయి మృతిచెందాడు. అటుగా వెళ్తున్న కొందరు చూసి లాడ్జి ప్రతినిధుకు చెప్పడంతో వారు పోలీసులుకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపశాఖ ఉద్యోగులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. గురుమూర్తి ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి త్రిమూర్తులు కూలీ పనిచేస్తుండగా, చెల్లి దివ్యాంగురాలు.

మెట్ల పై నుంచి జారిపడి వ్యక్తి మృతి

అల్లవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బెండమూరిలంక గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ ముత్యాల వీరన్నబాబు(47) బిల్డింగ్ మెట్ల పై నుంచి జారి పడి మృతి చెందాడు. శుక్రవారం బెండమూరిలంకలో యాళ్ల వెంకటరామోహనరావు బిల్డింగ్ పనులకు వచ్చిన వీరన్నబాబు మెట్ల పై నుంచి జారి పడి తీవ్ర గాయాలతో అపాస్మకర స్థితికి చేరుకున్నాడు. అమలాపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. అతడి కుమారుడు సాయిపవన్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ బి.సంపత్‌కుమార్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కె.గంగవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలో భట్లపాలిక శివారు చర్లంపూడికి చెందిన మేడిశెట్టి దుర్గారావు(40) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు పామర్రు ఇన్‌చార్జి ఎస్ఐ భుజంగరావు తెలిపారు. దుర్గారావు గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దుర్గారావు సోదరుడు మేడిశెట్టి వాడపల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

వ్యక్తిని గాయపర్చిన ముగ్గురిపై కేసు

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం బంగారంపేటకు చెందిన కర్రి నవీన్‌కుమార్, అతడి పిన్ని సువర్ణరత్నం ఇంటిముందు వేసిన కంకర విషయంలో ఘర్షణపడ్డారు. దీంతో సువర్ణరత్నం బంధువులు శేఖర్, సురేష్, కిరణ్ నవీన్ ఇంట్లోకి వచ్చి తలపై కొట్టి గాయపర్చారు. చంపుతామని బెదిరించడంతో కొవ్వూరు పోలీసులకు నవీన్ ఫిర్యాదు చేశాడు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి పేర్కొన్నారు.

గంజాయితో నలుగురి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మండపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని మారేడుబాక పంచాయతీ పరిధిలోగల సాయినగర్‌లో గంజాయితో నలుగురిని పట్టుకున్నామని పట్టణ ఎస్ఐ రాము తెలిపారు. గురువారం రాత్రి సాయినగర్‌లో యువత గంజాయి సేవిస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. మారేడుబాకకు చెందిన ఇద్దరు యువకులు, అనపర్తికి చెందిన యువకుడు, మండపేట పట్టణానికి చెందిన 17 ఏళ్ల బాలికను అదుపులోకి తీసుకుని వారి నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి ఆలమూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌విధించారని ఎస్ఐ తెలిపారు.

గోదావరిలో దూకి వృద్ధుడి మృతి



మృతిచెందిన విశ్వేశ్వరరావు

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో దూకి వృద్ధుడు మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామానికి చెందిన తాటి విశ్వేశ్వరరావు (65) పెళ్లి సంబంధాలు కుదుర్చుతుంటాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మద్దూరులంక- బొబ్బర్లంక మధ్య బ్యారేజ్ వంతెన పై నుంచి గోదావరిలో దూకేశాడు. అక్కడ ఉన్న జాలర్లు పడవల సాయంతో విశ్వేశ్వరరావును గుర్తించి బయటకు తీసుకువచ్చారు. అప్పటికే విశ్వేశ్వరరావు మృతిచెందాడు.

మహిళ గల్లంతు..

రోడ్డు కం రైలు బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకిన మహిళ గల్లంతైంది. కొవ్వూరు పట్టణ పోలీసులు, స్థానికులు అందించిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి సుమారు 30 వయస్సు కలిగిన మహిళ ఆటోలో కొవ్వూరు బయలుదేరింది. బ్రిడ్జిపై 151వ స్తంభం వద్ద ఆటో ఆపమని ఒక్కసారిగా వంతెనపై నుంచి గోదావరిలో దూకేసింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు బోటులో నదిలో గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలియరాలేదు. దీనిపై కేసు నమోదు కావలిసి ఉంది.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని కొవ్వూరు పట్టణ పోలీసులు గుర్తించారు. వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గోష్పాద క్షేత్రంలోని ఏపీ టూరిజం బోటు పాయింటు వద్ద 35 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉండే వ్యక్తి మృతదేహం కనిపిండంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక జాలర్ల సహాయంతో నది నుంచి బయటకు తీయించారు. మృతదేహం డీకంపోజ్ కావడంతో గుర్తుపట్టడానికి వీలులేకుండా తయారై మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసినవారు కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. వీఆర్వో విప్పర్తి మంగాయమ్మ అందించిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు.

ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రధాన అర్చకుడు ఫణికుమార్ శివైక్యం



కళ్లేపల్లి ఫణికుమార్ (ఫైల్)

ద్రాక్షారామ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామ భీమేశ్వరాలయ అనువంశిక అర్చకుడు, ప్రధాన అర్చకుడు కళ్లేపల్లి ఫణికుమార్ (83) శుక్రవారం శివైక్యం చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఫణికుమార్ సుదీర్ఘకాలం భీమేశ్వరాలయ అర్చకుడిగా సేవలందించారు. ఏపీ అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా ఫణికుమార్ అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆయన మృతికి సంతాపంగా భీమేశ్వరాలయాన్ని శుక్రవారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మూసివేశారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ అర్చక, వేదపండిత బృందం, ఆలయ సిబ్బంది, రామచంద్రపురం డివిజన్ ఆలయాల సిబ్బంది, ఏపీ పురోహిత బ్రహ్మణ సమాఖ్య బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి గణేష్‌శర్మ తదితరులు సంతాపం తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని ఇద్దరికి గాయాలు



గాయపడినవారిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కొవ్వూరు పట్టణానికి చెందిన కల్లూరి పైడిరాజు, బడే సత్యవతి బైక్‌పై దేవరపల్లి నుంచి కొవ్వూరు బయలుదేరారు. కాపవరం ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్ మధ్యలో డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో బైక్ పై నుంచి ఇద్దరు కింద పడిపోయారు. తల, చేతులు,కాళ్లకు గాయలయ్యాయి. 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ముమ్మిడివరంలో అగ్నిప్రమాదం

రూ.3 లక్షల ఆస్తినష్టం



ప్రమాదంలో కాలి బూడిదైన సర్టిఫికెట్లు





ముమ్మిడివరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ చింతలమెరకలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక డాబా దగ్ధమై రూ. 3 లక్షల ఆస్తినష్టం సంభవించింది. శుక్రవారం తెల్లవారుజామున మట్టపర్తి ప్రసాద్ (చిన్నబాల)కు చెందిన ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీక్ అవ్వడంతో మంటలు వ్యాపించి అగ్ని ప్రమాదం జరిగింది. బంగారపు ఆభరణాలు విలువైన దస్తావేజులు, పిల్లల స్కూల్ సర్టిఫికెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ముమ్మిడివరం అగ్ని మాపక ఇన్‌చార్జి అధికారి ఎం.బాల రాం ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.

రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని మృతదేహం



మాధవపురం రైల్వేగేటు సమీపంలో ఉన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న తుని రైల్వే పోలీసులు

పిఠాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని మాధవపురం రైల్వే గేటు సమీపంలో రైలు పట్టాలు పక్కన ఉన్న మృతదేహాన్ని తుని రైల్వే పోలీసులు గుర్తించారు. విశాఖపట్టణం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న రైలు నుంచి జారిపడి 40-50 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్టు భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదని తెలిపారు. ఎరుపు రంగు నెక్ టీషర్టు, కాకి నిక్కరు మృతదేహంపై ఉన్నాయని చెప్పారు. మృతదేహం కొంతభాగం ఎముకల గూడుగా ఉందని, దీనితో సంఘటన పది రోజుల క్రితం జరిగినట్టు భావిస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని తుని ఏరియా ప్రభుత్వాసుపత్రి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ప్రభుత్వ రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.

మేఘం మురిసెను..



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై అందంగా కనిపించింది. ఈ దృశ్యం చూపరులను కట్టిపడేసింది.

- ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి)

'దళిత యువకుడిపై భూమన అనుచరుల దాడి దారుణం'

కాకినాడ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో భూమన అనుచరులు దళిత యువకుడిపై దాడిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఖండించారు. పవిత్రమైన తిరుమల-తిరుపతిలో భూమన కరుణాకరరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో వైసీపీ అనుచరులు ఈ దాడికి పాల్పడ్డారన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం



టీటీడీ పంపించిన అమ్మవారి కుంకుమ, గాజులు, పసుపుతాడు, కంకణాలను మహిళలకు అందజేస్తున్న అధికారులు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో 'సౌభాగ్యం'

పిఠాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సౌభాగ్యం కార్యక్రమం నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా టీటీడీ ప్రత్యేకంగా పంపించిన సౌభాగ్య సామగ్రి, అమ్మవారి కుంకుమ, గాజులు, పసుపుతాడు, కంకణాలను ఆలయం వద్ద మహిళలకు అందజేశారు. అంతకు ముందు స్వామి, అమ్మవార్ల ముందుంచి పూజలు జరిపించారు. టీటీడీ సూపరింటెండెంట్ ఎం.మల్లికార్జున, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సందీప్, టీటీడీ వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'శ్రీప్రకాష్'లో సీబీఎస్ఈ క్లస్టర్-7 బాస్కెట్‌బాల్ పోటీలు

పెద్దాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామారావుపేటలో గల శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో శనివారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు సీబీఎస్ఈ క్లస్టర్-7 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ జరుగుతుందని డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వంద పాఠశాలల నుంచి 140 జట్లకు సంబంధించి 1,500 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. వారికి క్రీడా, వసతి ఏర్పాట్లు చేశామని చెప్పారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీదేవి



పిఠాపురం పాదగయ క్షేత్రంలో ప్రత్యేక అలంకారంలో పురుహూతికా అమ్మవారు



కొత్తపల్లి మండలం కొమరగిరిలో అన్నపూర్ణాదేవి



పిఠాపురంలో ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో గాజుల అలంకరణలో అపర్ణాదేవి

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

పిఠాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో వెలసిన రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఇళ్ల వద్ద వ్రతాలు ఆచరించే వారు స్నానాలు చేసి తిరిగి గృహాలకు వెళ్లారు. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు కుంకుమ పూజలు, ప్రత్యేక అర్చనలు, పుష్పార్చన జరిపారు. రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గల ఆలయాల్లో వరలక్ష్మీ వ్రత పూజలు వైభవంగా జరిగాయి. రైల్వేస్టేషన్ రోడ్డు, గుట్టల వీధి, జగ్గయ్య చెరువు కాలనీ, సినిమా సెంటర్, మంగాయమ్మ రావుపేట, అగ్రహారం తదితర ప్రాంతాల్లోని కనకదుర్గ ఆలయాలు, ఇతర ఆలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే పూజలు ప్రారంభించారు. కనకదుర్గ ఆలయాల్లో కుంకుమ పూజలు చేశారు. ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి.

శృంగేరి శంకర మఠం నిర్వహణలో పట్టణంలోని పెద్ద బజారులో వేంచేసియున్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి కుంకుమార్చన చేసిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకుడు ఇంద్రగంటి వెంకటగోపాలకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు జరిపారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొమరగిరిలోని విశ్వేశ్వరస్వామి ఆలయ ఆవరణలో గల అన్నపూర్ణాదేవికి విశేష అలంకరణ జరిపారు. మహిళలు పసుపు, కుంకుమ, గాజులతో పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రామకృష్ణ భక్తులకు పసుపు, కుంకుమ, గాజులతో పాటు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ప్రసిద్ధ ఆలయాలు, నివాస గృహాల్లో లక్ష్మీ పూజలు చేశారు. ఆలయాల్లో అమ్మవార్లకు అర్చకులు కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు జరిపి పుష్పాలంకరణ చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణాదేవిని గాజులు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సహస్ర నామార్చనలు, కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు నవదుర్గాలయంలో వ్యవస్థాపకురాలు కనక విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎనిమిది మంది ముత్తైదువులను అష్టలక్ష్మిలుగా అలంకరించి పండితులు అళక్కి రామం, ఇతర పండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య అష్టలక్ష్మీ వ్రతం జరిపారు. జోగా నందకిషోర్-రమ్య దంపతులు ఆశీనులయ్యారు. అనంతరం 2,025 మంది ముత్తైదువులతో సామూహిక వరలక్ష్మీ వ్రతం చేయించారు. మార్ని వెంకటేశ్వరరావు-వీరకుమారి, వంకా వీర్రాజు-వెంకటలక్ష్మి దంపతులచే 13వ వార్షిక కల్యాణోత్సవం అనంతరం పండిత సత్కారం నిర్వహించారు. అయోధ్యరామపురం కనకదుర్గమ్మ ఆలయంలో ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు కుంకుమార్చన చేశారు. హరిహర క్షేత్రం అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరాలయంలో మహాలక్ష్మి అమ్మవారికి వేదపండితులు పెండ్యాల సుబ్రహ్మణ్యశర్మ, మణికంఠ విశేష పూజలు జరిపారు.



సామర్లకోటలో అద్దాల మందిరంలో అమ్మవారు

ట్రస్టు బోర్డుల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ

సామర్లకోట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ జారీ అయినట్టు ఈవో బళ్ల నీలకంఠం తెలిపారు. ప్రొఫార్మా-2 ప్రకారం అర్హులైన అభ్యర్థులు 20 రోజులలోగా ధర్మకర్తల మండలి బోర్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 79893 89266 నెంబరుకు ఫోను చేయాలని కోరారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): తొలి తిరుపతిలో శృంగార వల్లభస్వామి ఆలయ ట్రస్టు బోర్డు నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి గలవారు ఇరవై రోజుల్లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.



వెంకన్న ఆలయంలో వైభవంగా పవిత్రాల సమర్పణ

పిఠాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో పట్టణంలో వేంచేసియున్న పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పవిత్రాల సమర్పణ వైభవంగా జరిగింది. ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. పవిత్రాల ప్రతిష్ఠ అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య పవిత్ర సమర్పణ గావించారు. శనివారం మహా పూర్ణాహుతితో కార్యక్రమాలు ముగుస్తాయి. టీటీడీ సూపరింటెండెంట్ ఎం.మల్లికార్జున, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సందీప్, టీటీడీ వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

కాంచన దుర్గ ఫిర్యాదులో వాస్తవం లేదు

మాజీ కార్పొరేటర్ సత్యప్రసాద్ స్పష్టం

కాకినాడ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): డబ్బు అవసరం నిమిత్తం చోడిపల్లి అవినాష్ రామ్ వద్ద ఇంటిని తనఖా పెడితే వేరొకరికి విక్రయించి మోసం చేశాడని కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన కాంచన దుర్గ మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదని మాజీ కార్పొరేటర్ చోడిపల్లి సత్యప్రసాద్ స్పష్టం చేశారు. ఈ విషయమై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు ఆయన వివరణ ఇచ్చారు. తన రెండో కుమారుడు అవినాష్‌రామ్‌కు 2022 అక్టోబరు 4వ తేదీన రూ.17 లక్షలకు కాంచన దుర్గ తన ఇంటిని విక్రయించిందన్నారు. కాకినాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు నెం.12917/2022గా రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. సర్వ హక్కులతో సంక్రమించిన ఈ ఇంటిని తన కుమారుడు ఆర్థిక అవసరాల నిమిత్తం ఇటీవల వేరొకరికి విక్రయించాడన్నారు. ఇందులో ఏ విధమైన మోసం జరగలేదని సత్యప్రసాద్ వెల్లడించారు.

ముగిసిన 20వ బ్యాచ్ హెవీ డ్రైవింగ్ శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ 20వ బ్యాచ్ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా కాకినాడ డిపోలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు శిక్షణ పొందిన అందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. డిపో మేనేజరు ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజరు టి.బాలకృష్ణ, డ్రైవింగ్ కాలేజీ ఇనస్ట్రక్టర్ కేడియం రాజు, శిక్షణ పొందిన 16 మంది పాల్గొన్నారు. 21వ బ్యాచ్ ఈ నెల 27వ తేదీన ప్రారంభమవుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు 9849644508 నెంబరును సంప్రదించాలని శ్రీనివాసరావు కోరారు.



అధ్యక్షుడిగా ఎన్నికైన నాగేంద్రకుమార్‌ను అభినందిస్తున్న సభ్యులు

బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నాగేంద్రకుమార్

పిఠాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బాక్సింగ్ అసోసియేషన్ కాకినాడ జిల్లా శాఖ అధ్యక్షుడిగా ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్ ఎన్నికయ్యారు. పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. అధ్యక్షుడిగా ఎన్నికైన నాగేంద్రకుమార్‌ను అభినందించి సత్కరించారు. బాక్సింగ్ క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.



శివదత్త నగర్‌లో మొక్కలు నాటుతున్న డాక్టర్ ఉమర్ ఆలీషా

'మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడదాం'

పిఠాపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడదామని విశ్వవిజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా పిలుపునిచ్చారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో 'నా మొక్క-నా శ్వాస' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని శివదత్తనగర్, వైఎస్సార్ గార్డెన్ తదితర ప్రాంతాల్లో ఆయన మొక్కలు నాటారు. ట్రస్టు ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ మంతెన సూర్యావతి, అహ్మద్ ఆలీషా, పోలుపర్తి వేణు, కొండబాబు, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్

కనీస వేతనం రూ.26 వేలు అమలు కోసం పోరాటాలకు సిద్ధం కావాలి

కాకినాడ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం రూ.26వేలు అమలుకై పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ అధ్యక్షతన కేంద్ర కార్మిక సంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో పెంచిన పని గంటలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా గత నెల 9న నిర్వహించిన జరిగిన కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మె విజయవంతం పట్ల అభినందనలు తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలకా రమణ, ఐఎన్‌టీయూసీ తెలుగు రాష్ట్రాల కార్యనిర్వాహక కార్యదర్శి తాళ్లూరి రాజు, ఏఐసీసీటీయూ రాష్ట్ర నాయకుడు గొడుగు సత్యనారాయణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభలను విజయవంతం చేయాలి

కాకినాడ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 30, అక్టోబరు 1 తేదీల్లో జగ్గంపేటలో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని ఏపీ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లా కార్యవర్గ సమావేశం అనంతరం మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సంఘ కార్యనిర్వాహక అధ్యక్షుడు చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ 2021లో జగన్ ప్రభుత్వం మెమో 1214 ద్వారా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను నిలిపివేసిందన్నారు. అధికారంలోకి రాగానే పునరుద్ధరిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా సంక్షేమ పథకాలను అమలు చేయలేదని విమర్శించారు. కార్మికులు దాచుకున్న సొమ్ము రూ.3 వేల కోట్లు సంక్షేమ బోర్డులో మూలుగుతున్నా కూటమి ప్రభుత్వం గానీ, నాయకులు గానీ స్పందించట్లేదన్నారు.

కార్మికుల సహనాన్ని పరీక్షించే కాలం పోయిందన్నారు. కార్మికులను పోరాటాలకు సిద్ధం చేయడం కోసమే ఈ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు బోరా సత్తిబాబు, కొల్లి సత్తిబాబు, వానపల్లి శివ, ఆకుల సత్యనారాయణ, మేడిశెట్టి వెంకటరమణ, రాము, కుంచె చిన్న, కండి బాబి, కె.బుజ్జి, చంద్రమళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు




రాఖీ పండుగకు రెడీ

పిఠాపురం/గొల్లప్రోలు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అన్నాచెల్లెలు, అక్కాతమ్ముడి అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా సందడి నెలకొంది. రాఖీ పౌర్ణమి సందర్భంగా తమ అన్నదమ్ములకు కట్టేందుకు అవసరమైన రాఖీల కొనుగోలు కోసం మహిళలు, యువత తరలిరావడంతో మార్కెట్లు రద్దీగా మారాయి. కాకినాడ నగరంతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, పెద్దాపురం, తుని, ఏలేశ్వరం పట్టణాలు, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రాఖీలు విక్రయించే దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. కొన్ని దుకాణాల వద్ద ఆఫర్లు పెట్టారు. గొల్లప్రోలులో ఒక షాపు వద్ద రాఖీలు కొంటే టెడ్డీబేర్ ఉచితం అంటూ కనిపించిన బోర్డు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈసారి కొన్ని ప్రాంతాల్లో డిజిటల్ రాఖీలు అందుబాటులోకి వచ్చాయి. రాఖీలు కట్టిన తమ సోదరీమణులకు బహుమతులు ఇచ్చేందుకు సోదరులు గిఫ్ట్ షాపులకు వెళ్లి వాటిని కొనడంలో బిజీగా మారారు. స్వీట్ల దుకాణాల్లో రాఖీ కోసం ప్రత్యేకంగా స్వీట్లను తయారుచేసి విక్రయానికి సిద్ధంగా ఉంచారు.

రోశమ్మకు నివాళి

గొల్లప్రోలు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మద్యపాన వ్యతిరేక ఉద్యమంలో దూబగుంట రోశమ్మ చూపిన పోరాట స్ఫూర్తిని అందరూ అలవర్చుకోవాలని మద్యపాన వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.సూర్యనారాయణ సూచించారు. గొల్లప్రోలు ఎస్సీ కాలనీలో రోశమ్మ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు దాడి పద్మనాభం, అధ్యక్షుడు ఏలేటి నానిబాబు, సారిక, వెలుగమ్మ, నాగరత్నం, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌లో అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

'సమస్యలను గుర్తించి ప్రజలకు సేవలందించాలి'

సామర్లకోట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లోని వార్డుల్లో దీర్ఘకాలంగా తిష్ట వేసిన సమస్యలను గుర్తించి అధికారులు లేదా తన దృష్టికి తీసుకురావాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. సమస్యలను గుర్తించి ప్రజలకు సేవలందించాలని కోరారు. నిమ్మతోట, పెద్దపులిచెరువు సమీపంలో ప్రజా గ్రీవెన్స్‌ను టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. పాత విమల్ లే-ఔట్‌లో తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని, రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని, పారిశుధ్య పరిస్థితిని మరింత మెరుగుపర్చాలని కోరారు. తాగునీటి సమస్యపై పత్రికల్లో వచ్చే కథనాలకు స్పందించి సత్వరం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించానన్నారు. అడబాల కుమారస్వామి, బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి, కంటే జగదీష్‌మోహన్ (బాబు), అందుగుల జార్జిచక్రవర్తి, గొలితి సత్యనారాయణ, యార్లగడ్డ నాగేశ్వరరావు, బాపినీడు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట పట్టణ పరిధి పెద్దపులి చెరువు గట్టు మీదుగా ఏడీబీ రోడ్డు నుంచి అన్నపూర్ణమ్మ ఆలయం వరకు జాతీయ ఉపాధి హామీ నిధులు రూ.50లక్షలతో రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే చినరాజప్ప శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి, కమిషనరు శ్రీవిద్య, రాజా సూరిబాబు రాజు, కంటే జగదీష్‌మోహన్ (బాబు), తోటకూర శ్రీనివాసు, చల్లా బుజ్జి, కోట అప్పారావు, యార్లగడ్డ నాగేశ్వరరావు, యార్లగడ్డ బాపినీడు, ప్రతిభ విద్యా సంస్థల అధినేతలు ఎస్వీవీజీ ప్రకాష్, సుధారాణి, పైడి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు 17 అర్జీలు

సామర్లకోట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఏడీబీ రోడ్డులోని కొప్పవరంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 17వ ప్రజా దర్బార్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వినతిపత్రాలు అందించేందుకు వచ్చారు. కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో 17 అర్జీలు స్వీకరించారు. 12 అర్జీలను అప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులను ఆదేశించడంతో సత్వరం పరిష్కారానికి నోచుకున్నాయి. పార్టీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కూడా ఒకరోజు కేటాయించేందుకు ఎంపీ సతీష్‌బాబు అంగీకరించారు. కార్యక్రమంలో ఆనంద్ న్యూటన్, చింతపల్లి అర్జున్, జున్నూరు బాబ్జీ, ఏటుకూరి నాగమణి, నరహరిశెట్టి సూరిబాబు, బండి నరేంద్ర, వెన్నపు చక్రధరరావు, చీకట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భావారంలో పారిశుధ్య చర్యలు

జగ్గంపేట రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భావారం గ్రామంలో డెంగ్యూ ప్రబలడంతో మండల ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. దోమల లార్వాను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నారు. నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించి పంచాయతీ సిబ్బందితో పారిశుధ్య చర్యలు చేపట్టారు. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఐటీడీఏ పీవో పనితీరుపై ప్రభుత్వం ఆరా

• తొలిసారి ఐవీఆర్ఎస్ ఫోన్ సర్వే • పనిచేసే అధికారులను ప్రజలే గుర్తించే విధానంపై దృష్టి

రంపచోడవరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధుల పనితీరును అంచనా వేసే ఐవీఆర్ఎస్ సర్వేను పనిచేసే ఉన్నతాధికారులను గుర్తించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయోగిస్తోంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా శుక్రవారం రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పనితీరుపై ఐవీఆర్ఎస్ సర్వే ప్రారంభమైంది. ఇందుకోసం 864531909 నెంబరు నుంచి ఐటీడీఏ పరిధిలోని పలువురికి ఫోన్‌కాల్స్ వచ్చాయి. ట్రూకాలర్‌లో పరిశీలిస్తే ఈ నెంబర్ ఏపీ గ్రీవెన్స్ ఫీడ్‌బ్యాక్ విభాగం పేరుతో నమోదై ఉంది. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పనితీరు ఎలా ఉందంటూ అభిప్రాయాలను సేకరించారు. ఇప్పటి వరకు ప్రజా ప్రతినిధుల, నాయకుల పనితీరుపై మాత్రమే ఆరాతీసి ఆమేరకు ఎన్నికల్లో వారికి సీట్లు ఇవ్వడం, ఉన్నత హోదా కల్పించడం జరిగేది. తొలిసారి ప్రజలకు సేవలు చేసే అధికారులు కూడా అదే తరహాలో బాగా పనిచేస్తున్నారా లేదా అన్నది గుర్తించి, ఎంచుకునే అవకాశాన్ని ఆయా ప్రాంతాల ప్రజలకే కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నాంది పలకడంపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. కొంత కాలంగా రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో అమలవుతున్న కార్యక్రమాలు, అధికారుల తీరుతెన్నులు, ప్రజలకు అందుబాటులో ఉంటున్న వైనం, ప్రజా సమస్యలపై స్పందిస్తున్న విధానాలను పరిశీలించిన ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకునే ముందు ఇక్కడి ప్రజల అభిప్రాయాన్ని కూడా తీసుకోవడానికే ఈ సర్వే చేపట్టిందని వ్యాఖ్యానిస్తున్నారు.

ఆదివాసీల హక్కుల అమలు కోసం ఉద్యమించాలి

రంపచోడవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కులు, చట్టాలను తుంగలో తొక్కుతున్న విధానాలపై ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర నాయకురాలు, పి.టాన్యా అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్‌పీ ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆదివాసీ సభలో ఆమె మాట్లాడారు. తొలుత మార్క్స్-ఎంగెల్స్ భవనం నుంచి ఆర్‌పీ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదివాసీ అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు కుంజా దూలయ్య, వి.చిట్టిబాబు, పల్లాల అశోక్, పల్లాల లచ్చిరెడ్డి, ఐ.వి.రమణ, పీవోడబ్ల్యు నాయకులు పి.అనసూయ, ఎస్.చిలకమ్మ, పీవైఎల్ నాయకులు ఇల్లా బాలురెడ్డి, కత్తుల సుగ్గిరెడ్డి, అన్నిక పండమ్మ, పి.ధర్మారెడ్డి, పి.ఆదిలక్ష్మి, వి.లక్ష్మి, కె.కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి


లిట్స్ పాఠశాల ప్రాంగణంలో ప్రపంచ ఆదివాసీ ముందస్తు వేడుక దృశ్యం

చింతూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కులను ఆదివాసీలు సద్వినియోగం చేసుకోవాలని లిట్స్ డైరెక్టర్ ఏసురత్నం అన్నారు. లిట్స్ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ముందస్తు వేడుక నిర్వహించారు. దీనికి ఆదివాసీ సంక్షేమ పరిషత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ముర్రం వీరభద్రం, ఉప ఎంపీపీ ఎడమ అర్జున్, ధనలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కణితి ముధు, జోగయ్య, ఆయా గ్రామాల ప్రజలు, లిట్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల సాధనకే తమ పోరాటం


ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

వై.రామవరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కుల సాధనకే తమ నిరంతర పోరాటమని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెదుళ్ల లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం కోట గ్రామంలో ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆదివాసీ జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన సమావేశం లో వక్తలు మాట్లాడారు. ఆదివాసీల సంప్రదాయాలతో దింసా, కోలాటం తదితర డాన్సులతో అలరించారు. కార్యక్రమంలో దండకారణ్య ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కూడా ఆనందరావు, సమీర్ రెడ్డి, జేఏసీ సభ్యులు పల్లాల లింగారెడ్డి, గొర్లె శ్రీకాంత్, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, ఫుడిగి లక్ష్మణరావు, గంగవరం ఎంపీడీవో రాజేశ్వరరావు, ఆదివాసీలు పాల్గొన్నారు.

ఆదివాసీ వేడుకలకు తరలిరండి

దేవీపట్నం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేట స్త్రీశక్తి భవనం పక్కనున్న ఆదివాసీ భవనం స్థలంలో శనివారం నిర్వహించే ఆదివాసీ వేడుకలను విజయవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామ పెద్దలు, ఆదివాసీ సంఘాల నాయకులు, ఉద్యోగులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కారం రామన్నదొర, అరగంటి వీరభద్రరెడ్డి, యలగాడ నాగేశ్వరరావు, మడి మురళిదొర, పండ ఏడుకొండలు దొర, కలుం సూర్యప్రకాష్‌దొర, కారం రంగారావుదొర తదితరులు ఉన్నారు.

చింతూరు డివిజన్‌లో న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

మోతుగూడెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం గ్రామంలో శుక్రవారం ఉమ్మడి రాష్ట్ర సలహాదారులు సోందే వీరయ్య పర్యటించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లో మాజీ సర్పంచ్ కారం బాబులు ఆధ్వర్యంలో వీరయ్య మాట్లాడుతూ విలీన మండలాల్లో ఎటపాక కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మడకం వీర్రాజు సత్యనారాయణ, జల్లి శ్రీదేవి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'తమ కూతురును క్షేమంగా అప్పగించరూ..'

రంపచోడవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తన కూతురు సౌమ్యను క్షేమంగా అప్పగించాలని తండ్రి సోయం మల్లుదొర శుక్రవారం మీడియా ఎదుట తన గోడు వినిపించారు. విధి నిర్వహణలో ఉన్న తన కుమార్తెను కిడ్నాప్ చేసిన వారిని శిక్షించడంతో పాటు, ఆమెను క్షేమంగా తీసుకురావాలన్నారు. శరభవరం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న తన కుమార్తెను కొందరు కిడ్నాప్ చేసినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించి తన కూతురిని క్షేమంగా అప్పగించాలని కోరారు.

గండిపోశమ్మ దేవాలయ ట్రస్టు బోర్డుకు ఆహ్వానం

దేవీపట్నం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందూరు గ్రామంలో నున్న గండిపోశమ్మ అమ్మవారి దేవాలయానికి ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు కార్యనిర్వహణాధికారి గండి వెంకట లక్ష్మీకుమార్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 20 రోజుల్లోపు జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖాధికారికి అప్లికేషన్ పంపాలన్నారు. వివరాలకు తూర్పు గోదావరి జిల్లాలోని సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

డొంకరాయిని మండల కేంద్రంగా చేయాలి

మోతుగూడెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలాన్ని రెండు భాగాలుగా చేసి డొంకరాయిని మండలం కేంద్రంగా చేయాలని ఎంపీటీసీ కరకా వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. దీనిపై ఏఎస్ఆర్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. దాన్ని మీడియాకు విడుదల చేశారు. మండలం కేంద్రం ఏర్పాటు కోసం డొంకరాయి ప్రజలు 15 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

మళ్లీ తెరపైకి..

ప్రత్యేక మండల నినాదం

సబ్‌ప్లాన్ ఏజెన్సీని పెదమల్లాపురంగా ప్రకటించాలని

కోరుతున్న ఆదివాసీలు


పెదమల్లాపురం గ్రామం

ప్రత్తిపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లోని 5 మండలాల్లో పరిధిలో ఉన్న సబ్‌ప్లాన్ ఏజెన్సీని పెదమల్లాపురం కేంద్రంగా ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలనే నినాదం మళ్లీ తెరపైకి వచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మన్య ప్రాంతంలోని వై.రామవరం సమీపంలో ఉన్న గుర్తేడు మండల కేంద్రంగా నూతనంగా ప్రత్యేక మండలం ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేయడంతో సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులు కూడా మళ్లీ పెదమల్లాపురం కేంద్రంగా సబ్‌ప్లాన్ ఏజెన్సీని మండలంగా ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని శంఖవరం, రౌతులపూడి, ఏలేశ్వరం.. తుని నియోజకవర్గంలోని కోటనందూరు మండలాల పరిధిలో 59 సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాలు ఉండగా వీటిలో 32వేల మంది ఆదివాసీలు నివసిస్తున్నారు. గతంలో రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉంటే సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాలు జిల్లావిభజన తరువాత సబ్‌ప్లాన్ ఏజెన్సీకి ఐటీడీఏ లేకుండా పోయింది. దీంతో సబ్‌ప్లాన్ ఏజెన్సీ ఆదివాసీలు సంక్షేమ పథకాలు, ఐటీడీఏ సౌకర్యాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనుల ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు గిరిజనుల కొండపోడు పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులకు ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలనే డిమాండ్ 4దశాబ్దాలుగా కొనసాగుతుంది. 1984లో తొలుతగా సబ్‌ప్లాన్ ఏజెన్సీని పెదమల్లాపురం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని ఆదివాసీలు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టారు. అదే క్రమంలో గుర్తేడును కూడా మండల కేంద్రంగా ప్రకటించాలని ఆ ప్రాంత గిరిజనులు కూడా ఉద్యమం ప్రారంభించారు.

హామీ సంగతేంటి..

గత ఎన్నికల ప్రచార సమయంలో ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరంలో జరిగిన సభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాలకు పెదమల్లాపురం గిరిజన సాధన కమిటీకి చెందిన బి.బాలరాజు, జర్త ముసలయ్య, ఆదివాసీ సంఘ సభ్యులు వినతిపత్రం అందజేశారు. పెదమల్లాపురం మండల ఏర్పాటుకు పవన్‌కల్యాణ్, సత్యప్రభ హామీ కూడా ఇచ్చారని సాధన కమిటీ సభ్యులు చెబుతున్నారు. ఇది ఇలా ఉంటే ప్రస్తుతం గుర్తేడు కేంద్రంగా మండలం ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం పెదమల్లాపురం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు పెదమల్లాపురంలో ఐటీడీఏను కూడా ఏర్పాటు ఆదివాసీలు కోరుతున్నారు. ఇప్పటికైనా గుర్తేడును మండల కేంద్రంగా గుర్తించిన ప్రభుత్వం పెదమల్లాపురంను కూడా ప్రత్యేక మండలంగా చేసి ఐటీడీఏను ఏర్పాటు చేయాలని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులు కోరుతున్నారు. ఆగస్టు9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పెదమల్లాపురం మండల కేంద్రం ఏర్పాటు చేయాలనే ఉద్యమం ఉధృతం చేస్తామని సాధన కమిటీ సభ్యులు బూసిరి బాలరాజు, జర్తా ముసలయ్య తెలిపారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టర్ షాన్ మోహన్ పెదమల్లాపురంలో పర్యటించే అవకాశం ఉండడంతో పెదమల్లాపురం మండల అంశాన్ని లేవనెత్తేందుకు సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులు సిద్ధమవుతున్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు

భక్తులతో ఆలయాలు కిటకిట


తునిలో వరమహాలక్ష్మిని పసుపు కొమ్ములతో అలంకరించిన దృశ్యం


కోటనందూరు మండలం కాకరాపల్లిలో కనకదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణ


ప్రత్తిపాడు: రాచపల్లిలో అరుణాచలేశ్వర ఆలయంలో అమ్మవారికి గాజుల అలంకారం

తునిరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణమాస పర్వదినాలను పురస్కరించుకుని శుక్రవారం వరలక్ష్మి వ్రత పూజలు ఆలయాల్లో నిర్వహించారు. తపోవన క్షేత్రంలో పీఠాధిపతులు శ్రీసచ్చిదానంద సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే తుని చిట్టూరి మెట్రో వద్ద శ్రీవైకుంఠ నారాయణసహిత వరహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారిని పసుపుకొమ్ములతో అలంకరించారు. పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు చేశారు.

ఏలేశ్వరం(ఆంధ్రజ్యోతి): యర్రవరం, లింగంపర్తి, జె.అన్నవరం, సిరిపురం గ్రామాల్లో కనకదుర్గమ్మ తల్లి, వరలక్ష్మీ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఏలేశ్వరం తోట వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్, సువ్వయ్యమ్మపేట ఆలయాలను అర్చకులు పూలతో తీర్చిదిద్ది అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చీర, రవిక, బంగారు రూపు, పిండి వంటలు నైవేద్యంగా పెట్టి సామూహిక పూజలు నిర్వహించారు.

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట చెరువు గట్టుపైన కనకదుర్గమ్మ రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామి, శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి,సర్వకామదాంబ సమేత శ్రీఉమా రామలింగేశ్వర స్వామి, గ్రామదేవత రావులమ్మ తల్లి సత్తమ్మ తల్లి, నూకాలమ్మ తల్లి ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు వెళ్లి దర్శనాలు చేసుకున్నారు. దుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్నిగ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీపంలోగల కనకదుర్గ అమ్మవారి ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

రౌతులపూడి, (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా దుర్గాదేవి ఆలయాలు కిటకిటలాడాయి. రౌతులపూడిలో దుర్గాదేవి ఆలయంలో పూజారి చిట్టెం బానుబాబు కుంకుమ పూజలు నిర్వహించారు.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిళలు శుక్రవారం వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు. అనంతరం ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు.

తొండంగి (ఆంధ్రజ్యోతి): ఏవీ నగరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఏకొత్తపల్లి భువనేశ్వరీ సమేత విజయేశ్వరుని ఆలయంలో పూజలు జరిగాయి.


ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): రాచపల్లిలోని అపీతకుచాంబ అమ్మవారిని గాజులతో అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి అడ్డురోడ్డు, శరభవరం, ఏలూరు గ్రామాల్లోని కనకదుర్గ ఆలయాల్లో కుంకుమార్చనలు నిర్వహించి మహిళలు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు 'శ్రీప్రకాష్' విద్యార్థుల ఎంపిక


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తునిరూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు అక్షర విద్యాలంలో జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్-7 అథ్లెటిక్స్ పోటీల్లో తుని శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-19 విభాగంలో జావలిన్ త్రోలో 400 మీటర్ల పరుగుల పోటీలో ఆదిత్యకుమార్, జయసత్య, సునీల్‌కుమార్, సత్యపవన్, దుర్గాప్రసాద్.. బాలుర అండర్ 14 విభాగంలో 400 మీటర్ల పరుగుల పోటీల్లో ఎం.కేశవ్‌కుమార్ బంగారు పతకాలు సాధించారు. వారణాసిలో అతులానంద్ కాన్వెంట్ స్కూల్‌లో సెప్టెంబరు 10 నుంచి 13 మధ్య జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వికె నరసింహరావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, కోచ్‌లు చిన్నా, రామాంజనేయులు అభినందించారు.

'మెరుగైన సేవలందించడమే లక్ష్యం'


కె.కొత్తాంలో అవగాహన సదస్సు దృశ్యం

కోటనందూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్‌వి ప్రసాద్ అన్నారు. శుక్రవారం కె.కొత్తాంలో డీఎఫ్ఎస్ క్యాంపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలనే జిల్లావ్యాప్తంగా 385 గ్రామాల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌హెచ్ రంగయ్యనాయుడు, ఎస్ఐ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చిటికెల సత్యనారాయణ, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శివశంకర్‌రెడ్డి, సాయిలక్ష్మణ్, అప్పారెడ్డి సలాదినాగు వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దని నిరసన

ఏలేశ్వరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని సీపీఎం పార్టీ నాయకులు పిల్ల రాంబాబు శుక్రవారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో రొంగల ఈశ్వరరావు, రౌతు సత్యనారాయణ, దొంగబాబు, సత్యవతి, వెంకటలక్ష్మి, రత్నం, చిరంజీవి పాల్గొన్నారు.

పీ4 పథకం ద్వారా ఇళ్లు నిర్మిస్తాం

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ


గండేపల్లి మండలం కె.గోపాలపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో కె.గోపాలపురం గ్రామంలో శిధిలావస్థకు చేరిన ఇళ్లను శుక్రవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరిశీలించారు. స్థానికులు మాట్లాడుతూ గ్రామంలో 1985లో అప్పటి సీఎం ఎన్టీఆర్ గిరిజనులకు 5సెంట్లు స్థలం, రూ.3వేలు ఇచ్చి పెంకుల ఇళ్ల నిర్మాణం చేశారన్నారు. ఇప్పటికి 40 సంవత్సరాలు పూర్తికావడంతో ఇళ్లు ఇధిలావస్థకు చేరుకున్నాయని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లను ప్రభుత్వం పీ4 పథకంలో ఇనుప రేకులతో మోడల్ గృహాలు నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షులు పోతుల మోహనరావు, అడబాల భాస్కరరావు, అవసరాల బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నెహ్రూకు ఆహ్వానం

జగ్గంపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సూపర్ సిక్స్ పథకాలలో భాగమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15న ప్రారంభిస్తున్నారు. అందులో భాగంగా జగ్గంపేట నియోజకవర్గం గోకవరం డిపో నుంచి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభించేందుకు గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్ సుచరిత మార్గరెట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే నెహ్రూను ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ వసతి 'స్త్రీ శక్తి' పేరుతో ఈనెల 15న నుంచి అమల్లోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్. ఏ అప్పారావు తదితరులు పాల్గొన్నారు

నెహ్రూను కలిసిన ఆలయ కమిటీ

జగ్గంపేట రావులమ్మ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కాకినాడ రూరల్ టీడీపీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో సామర్లకోట రూరల్ మండలం నవర గ్రామంలో నూతనంగా నిర్మాణం అవుతున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి విగ్రహాలను అందించవలసిందిగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను గ్రామ మాజీ సర్పంచ్ సిద్ధి నూకరాజు, రామదేవ సీతయ్య దొర, కేశవరపు సత్యనారాయణ, తదితర ఆలయ కమిటీ సభ్యులు కలిసి కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు గృహాలు ఏర్పాటు చేయాలి

కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే సత్యప్రభ


పెదశంకర్లపూడిలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినశంకర్లపూడిలో అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం వెంటనే గృహాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కోరారు. మండలంలోని చినశంకర్లపూడి అగ్నిప్రమాద బాధితులు బుర్రి మరిడమ్మ, మానూరి రాజబాబు, ముతకల నాగేశ్వరరావు, కిరాటి అచ్చారావు, కిరాటి అప్పారావు, పులగపూడి సత్యనారాయణ స్థానిక టీడీపీ నాయకుడు మిరియాల శ్రీనుతో కలిసి శుక్రవారం పెదశంకర్లపూడిలో ఎమ్మెల్యే నిర్వహించే స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ప్రమాదంలో రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు, నలుగురు విద్యార్థుల పుస్తకాలు, దుస్తులు కాలిపోవడంతో వెనువెంటనే వాటిని సమకూర్చే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కలెక్టర్‌ను కోరారు. 6 కుటుంబాలవారు పూర్తిగా నివాసుతులై రహదారి వెంబడి టెంట్‌లు వేసుకుని ఇబ్బంది పడుతున్నారని వారికి హౌసింగ్ మంజూరు చేయించి ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

గాంధారమ్మ విగ్రహ ప్రతిష్ఠ


ఏలేశ్వరం గాంధారమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ దంపతులు

ఏలేశ్వరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏలేరు నదీతీరాన గాంధారమ్మ తల్లి ఆలయాన్ని దాతల సాయంతో శుక్రవారం పున ప్రతిష్ఠించారు. కోరాడ వీర్రాజు నేతృత్వంలో అలమండ దుర్గా వెంకట ప్రసాద్ సూర్యనారాయణమ్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్ అలమండ చలమయ్య దంపతులు అమ్మవారిని దర్శించుకుని చీర, రవిక, పసుపు, కుంకుమ ఆలయానికి అందజేశారు. కౌన్సిలర్ బదిరెడ్డి గోవిండ్, శిడగం వెంకటేశ్వరరావు, పైల శ్రీధర్, రమణ, గూ నాపు అప్పలరాజు పాల్గొన్నారు.

కనకదుర్గకు బంగారు హారం బహూకరణ


ఆలయంలో హారాన్ని బహూకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జగ్గంపేట రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.కొత్తూరు కనకదుర్గ అమ్మవారికి వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం రూ.1.50లక్షల విలువచేసే బంగారం బహూకరించారు. హారాన్ని దాతలు, ఆలయ కమిటీ సభ్యులు కలిపి చేయించినట్టు చైర్మన్ నకిరెడ్డి శివ తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ చాలా రామ్మూర్తి, అడపా తాతాజీ, బుదిరెడ్డి చక్రరావు, మాతేశ్వరరావు పాల్గొన్నారు.

శివభద్రరావుకు సత్కారం

జగ్గంపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం జె.కొత్తూరు శివారు కనకదుర్గమ్మ ఆలయం వద్ద హిందూ జనశక్తి కాకినాడ జిల్లా అధ్యక్షుడు బోధ శివభద్రరావును ఆలయ కమిటీ చైర్మన్ నకిరెడ్డి శివ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. మోటూరు వెంకన్న, బద్ది సురేష్, దంట కామరాజు, అడపా తాతాజీ, మరిసే కృష్ణ, గంప విష్ణు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి సహాయం

ప్రత్తిపాడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో కేదారి మంగ అనే మహిళ ఆపరేషన్ చేయించుకోవడంతో శుక్రవారం ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత ముదునూరి మురళీకృష్ణంరాజు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామసభ్యులు కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, దొడ్డిపట్ల కృష్ణ పాల్గొన్నారు.


పింఛను అందజేస్తున్న బాబురావు

పింఛను అందజేత

గండేపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పిలుపుమేరకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని సూచించారని సూరంపాలెనికి చెందిన కూటమి నేత పోసిన బాబురావు అన్నారు. దీంతో సూరంపాలెంలో ముగ్గురు వితంతువులకు రూ.3వేలు చొప్పున పింఛన్ అందించి వీరికి ప్రభుత్వం పింఛన్ వచ్చే వరకు తాను ఇస్తానని తెలిపారు.

ఘనంగా వరలక్ష్మి వ్రత పూజలు

వీఆర్‌పురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని మహిళలు ఇంటి వద్ద వరలక్ష్మి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అధికసంఖ్యలో మహిళలు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఇంటి వద్ద వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.